Licenced to Post without Prepayment (AP/VJ-16/WPP/2012-13)


స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు స్థాపితం: 1930 జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి

Longest Living Newspaper in Telugu Journalism

# జ్యోతి

సంపుటి: 82 • సంచిక: 42 • 12-10-2012 శుక్రవారం • పేజీలు: 16 • విడి ప్రతి: రూ.5/-

జ్యోతి
పాగతోట, నెల్లూరు - 524 001
ఫోన్: 0861 - 2327354
సెల్: 98489 66190
జీవిత చందా రూ.1000లు
సంవత్సర చందా
స్వదేశంలో రూ.200లు
విదేశాలకు రూ.1000లు




# కాంగ్రెస్ సర్కారుకు ప్రజల మీద అంత కక్షా?

- **ఆంధ్రప్రదేశ్‌ను అంధకార ప్రదేశ్‌గా మారుస్తున్నారు.**
- **వ్యవసాయానికి విద్యుత్ ఇవ్వలేమని సిగ్గు లేకుండా ప్రకటనలు చేస్తున్నారు.**
- **ప్రభుత్వానికి ఏ మాత్రం ముందు చూపు వున్నా ఈ దుర్గతి ఏర్పడేదే కాదు.**
- **మరొక ప్రక్క కేంద్రం సామాన్యుడి నడ్డి విరుస్తున్నది.**

ప్రభుత్వాలకు ముందు చూపు వుండాలని నియమం. కానీ మన రాష్ట్ర ప్రభుత్వానికి అసలు చూపన్నదే లేకుండా పోయినట్లుంది. తనకు గుడ్డి కాబట్టి, తన ప్రజలు కూడా చీకట్లో బ్రతకాలని కోరుకొంటున్నట్లు కన్పిస్తున్నది. రానున్న జూన్ నెల వరకు రాష్ట్రంలో కరెంట్ ఉత్పత్తి, సరఫరాలపై ఎపి ట్రాన్స్‌కో ప్రచురించిన నివేదిక చూస్తే ఇది ఆంధ్రప్రదేశా లేక అంధకార ప్రదేశా అన్న అనుమానం కల్గుతున్నది.

ప్రజల అవసరాలలో కనీసం సగం మేర తీర్చడానికి కూడా తమ వద్ద శక్తి లేదని చేతులెత్తేసింది రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ. రబీ పంట సమయంలో వ్యవసాయానికి కరెంట్ ఇవ్వడం అసాధ్యమని తేల్చి చెప్పింది. ఒకవేళ రైతులకు కరెంట్ ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశిస్తే, నగరాలు, పట్టణాలతో సహా రాష్ట్రం మొత్తం మీద ఇళ్ల వాడకానికి రోజుకు పది గంటలకు తక్కువ కాకుండా విద్యుత్ కోత విధించక తప్పదని; దానికి అదనంగా పరిశ్రమలకు వారంలో ఐదు రోజులు విద్యుత్ సరఫరా నిలిపివేయవలసి వస్తుందని వివరించింది ట్రాన్స్‌కో. ఉత్పత్తికి, డిమాండ్‌కు పొంతన లేని పరిస్థితి వల్ల తలెత్తుతున్న దారుణ పరిస్థితి ఇది. ఇప్పటికే రాష్ట్రంలో వేలాది చిన్న పరిశ్రమలు మూతపడి పోయాయి. లక్షల సంఖ్యలో కార్మికులు ఉద్యోగాలు కోల్పోయారు. వారి భవిష్యత్తు అంధకార బంధురంగా మారింది. పరిశ్రమల స్థాపన కోసం ఇచ్చిన అప్పులు ఎట్లా వసూలు చేసుకోవాలో తెలియక బ్యాంకులు, ఆర్థిక సంస్థలు నెత్తిన చేతులు పెట్టుకొని వున్నాయి. పరిశ్రమ నడిస్తే రాబడి వస్తుంది. అందులో నుంచి అప్పుల చెల్లింపు జరుగుతుంది. అసలు యంత్రాలే కదలని దుర్గతిలో ఏ పారిశ్రామికుడైనా బ్యాంకు అప్పు ఎక్కడ నుంచి తెచ్చి చెల్లిస్తాడు?

హైదరాబాదుతో సహా రాష్ట్రం మొత్తం మీద ఇళ్ల వినియోగదారులు విద్యుత్ కోతతో అల్లాడిపోతున్నారు. రోజుకు ఆరు గంటల వరకు కరెంట్ వుండడం లేదు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేని ఆఫీసులు, మరీ ముఖ్యంగా ప్రభుత్వ కార్యాలయాలలో పని స్తంభించి పోతున్నది. కంప్యూటర్లు పని చేయకుంటే ఏమి పని జరుగుతుంది? పల్లెలలో పరిస్థితి చెప్పలేనంత దుర్భరంగా వుంది. కొన్ని గ్రామా

కొరవ 14వ పేజీలో

### బాబు కాలి బొబ్బలతో...

# పార్టీకి మళ్లీ జీవం

చంద్రబాబు పాదయాత్ర సాఫీగా సాగిపోతున్నది. వ్యూహాత్మకంగా అనంతపురం జిల్లాలో తమ పార్టీకి బాగా బలం కల్గిన ప్రాంతంతో యాత్ర మొదలు పెట్టడం వల్ల వేలెత్తి చూపదగిన లోపం లేకుండా నడిచి పోతున్నది. ఇప్పటి వరకు ఆయన నడిచిన ప్రాంతం – పరిటాల రవి సతీమణి సునీత, పయ్యావుల కేశవ్‌కు సంబంధించిన గ్రామాలు. వారిద్దరూ జనంలో పలుకుబడి కల్గినవారు కావడంతో తమ నాయకుడికి చిన్నతనం అన్నది ఎదురు కాకుండా జనసమర్ధంగా నడిపించారు. ఆయన తదుపరి మజిలీ కర్నూలు జిల్లా. అక్కడ తెలుగుదేశం పరిస్థితి ఏమంత బాగాలేదన్నది నిజం. ఉన్న ఒక్క నేత బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి కూడా రాయలసీమ ఉద్యమ నెపంతో పార్టీ వదలిపోయాడు. భూమా నాగిరెడ్డి దంపతులు ఎప్పుడో జగన్ గూటికి జారుకొన్నారు. ఒక్క కెఇ కృష్ణమూర్తి మాత్రమే మిగిలి వున్నాడక్కడ. ఆయన ఎంత మాత్రం ఈ పాదయాత్ర పట్ల శ్రద్ధ చూపుతాడో చెప్పలేము.

కొరవ 14వ పేజీలో









# సుప్రీం గర్జన

వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి బెయిల్ నిరాకరించడంలో సుప్రీంకోర్టు చాలా కఠినంగా వ్యవహరించింది. ఇప్పుడు బెయిల్ ఇవ్వకపోవడమే కాదు, వచ్చే ఏడాది మార్చి నెల చివరి వరకు మరొక కోర్టులో బెయిల్ దరఖాస్తు చేసుకోవడానికి కూడా అవకాశం లేకుండా స్పష్టమైన ఆదేశం వెలువరించారు న్యాయమూర్తులు. అంటే రానున్న ఆరు నెలల కాలం జగన్ జైలులోనే గడపక తప్పదన్న మాట. నేర విచారణ సమయంలో నిందితుల పట్ల సుప్రీంకోర్టు ఇంత కఠినంగా వ్యవహరించడం అసాధారణ విషయం. దాని వెనుక చాలా పెద్ద నేపథ్యమే వుందని భావించాలి.

జగన్ మామూలు నిందితుడు కాదు. వేల కోట్ల రూపాయల అక్రమ ఆర్జనకు పాల్పడినట్లు ప్రాథమిక రుజువులో నిర్ధారణ అయిన ఆర్థిక నేరస్తుడు. ఆయన కట్టుకొన్న భవంతులు, వాటిలో బంగారు పరదాలు, హంస తూలికా తల్పాలు, ఆయన స్థాపించిన కంపెనీలు, వాటిలోకి వేల కోట్ల రూపాయల నిధుల ప్రవాహం, ఈ ఎదుగుదల సమస్తం ఆయన తండ్రి ముఖ్యమంత్రిగా వున్న స్వల్పకాలంలో మాత్రమే సంభవించడం యావత్ ప్రజానీకానికి తెలిసిన నిజం. తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకొని ప్రజా ధనాన్ని పటిక బెల్లం వలె అప్పనంగా ఆరగించడం వల్లనే వైఎస్ జగన్ ఇంత శ్రీమంతుడు అయ్యాడని ప్రత్యేకంగా వివరించి చెప్పనవసరం లేదు. గత కొంతకాలంగా దేశ రాజకీయాలలో వైఎస్‌జగన్‌ను పోలిన ఆర్థిక నేరస్తులు కుప్ప తెప్పలుగా పుట్టుకొని వస్తున్నారు. ఎవరి స్థాయిలో వారు పందికొక్కుల కంటే హీనంగా, బందిపోట్ల కంటే ఘనంగా ప్రజల ఆస్తులను దోచుకొని దాచుకొంటున్నారు. 2జి స్కాం, కామన్‌వెల్త్ గేమ్స్ గోల్‌మాల్, ఆదర్శ్ ఇళ్ల కుంభకోణం, రక్షణ శాఖలో పలు రకాల స్కాములు, బొగ్గు గనులలో బొక్కుడు... ఇట్లా చెప్పుకొంటూ పోతే ఎన్నైనా కన్పిస్తాయి. గత పదేళ్ల కాలంలో రాజకీయవాదుల దోపిడీ పోకడ వల్ల ఆవిరైపోయిన ప్రజాధనం ఎన్ని లక్షల కోట్ల రూపాయలో వూహించడం కష్టం. కొన్ని తరాల పాటు జాతి ప్రయోజనాలకు ఉపకరించవలసిన సహజ వనరులు, భూములు, గనులు రాజకీయవాదుల స్వార్థానికి బలైపోయాయి. విచిత్రం ఏమిటంటే ఏ ఒక్క రాజకీయవాది కూడా ఇది తప్పుగా భావించడం లేదు. సుప్రీంకోర్టు లేదా హైకోర్టులు జోక్యం చేసుకొంటే తప్ప వీటిపై విచారణ జరగడం లేదు. విచారణ మొదలైన తర్వాత కూడా మన న్యాయ వ్యవస్థలోని లోపాలను, లొసుగులను అడ్డు పెట్టుకొని ఏళ్ల పూళ్ల కేసుల పురోగతిని అడ్డుకొంటున్నారు. రాజ్యాంగ హక్కులు, మానవ హక్కుల పేరిట న్యాయ నిపుణులను ప్రయోగించి సులభంగా బెయిల్ పొందుతున్నారు. నేర విచారణ జరిపే సిబిఐ, ఈడి, విజిలెన్స్, ఎసిబి వంటి సంస్థల చేతులకు సంకెళ్లు వేస్తున్నారు. దాని వల్ల ప్రజాధనం దోపిడీకి పాల్పడే వారికి చట్ట భయం లేకుండా పోతున్నది.

ఈ దుస్థితిని చక్కదిద్దడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎటువంటి ప్రయత్నమూ చేయడం లేదు. అందుకు కారణం ఈ దోపిడీదారులతో వారికున్న అక్రమ సంబంధాలు. కొన్ని సందర్భాలలో దోపిడీ దొంగలే ప్రభుత్వ నేతలుగా కూడా చలామణి అవుతున్న దౌర్భాగ్యం. దేశాన్ని ఈ దుర్గతి నుంచి తప్పించడానికి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా గత నెలలోనే రిటైర్ అయిన కపాడియా సాహసోపేత ప్రయత్నం చేశాడు. సుప్రీంకోర్టు పేరు చెప్తే ఆర్థిక నేరస్తుల గుండెల్లో చలి జ్వరం పుట్టేలా వ్యవహరించాడు. దానికి కొనసాగింపే ఇప్పుడు వైఎస్ జగన్ బెయిల్ నిరాకరణ సందర్భంలో సుప్రీంకోర్టు కఠిన వైఖరి. జగన్ అక్రమ ఆర్జన గురించి సుప్రీంకోర్టు ప్రాథమిక అవగాహనకు వచ్చినందువల్లనే ఇటువంటి తీర్పు వెలువడిందని భావించవచ్చు. అంత స్వల్పకాలంలో అన్ని వేలకోట్ల రూపాయలు ఎట్లా సంపాదించారని న్యాయమూర్తులు ప్రశ్నించడం అందుకొక నిదర్శనం. జగన్ ఆర్థిక నేరాల గురించి సిబిఐ వంటి సంస్థలు ఇచ్చిన నివేదికలు, అందుకు చూపిన ఆధారాలు న్యాయమూర్తులకు ఉపకరించినట్లున్నాయి. అందువల్లనే వారు ఆర్థిక నేరస్తుల గుండెలు వణికేలా గర్జించారు. భవిష్యత్తులో జగన్ వలె ఆర్థిక నేరాలకు పాల్పడే ప్రతి నిందితుడికీ ఇదొక హెచ్చరికగా మారుతుందని ఆశించవచ్చు.

జమీన్‌రైతు

## జనవాణి

### ప్రాంతీయవాదాన్ని నమ్మొద్దు!

ప్రత్యేక వాద ఉద్యమాలతో మన రాష్ట్రాభివృద్ధి నానాటికీ దిగజారుతున్నది. అంతులేని అవినీతితోపాటు నిత్యజీవితావసర వస్తువుల ధరలు నింగికి ఎగురుతున్నాయి. ఆసుపత్రులు అనారోగ్యం పాలవుతున్నాయి. ఇప్పటికే విద్యుత్ ప్రైవేటుపరం అయ్యింది. దానికితోడు విద్య, తాగునీరు సామాన్యుడికి అందకుండా జేసేందుకు, ప్రైవేటు కంపెనీలకు ధారాదత్తం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మార్గం సుగమం చేసింది. ఈ సమస్యలన్నింటిపై ప్రజల ఆలోచన మరలకుండా ఉండేందుకు పాలకవర్గాలు ప్రాంతీయతత్వాన్ని పెంచి పోషిస్తున్నాయి. ఒకే భాష మాట్లాడే ప్రజల సౌలభ్యం కోసం భాషాప్రయుక్త రాష్ట్రాలు ఉండాలని ఆనాడు కమ్యూనిస్టులు ఉద్యమం చేశారు. మొదట్లో అడ్డుపుల్ల వేసినా కాంగ్రెస్ ఆ తర్వాత దిగిరాక తప్పలేదు. ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాక పాలకవర్గాలు అనుసరించిన విధానాలు, అసమానతల వల్ల ఓ ప్రాంతం ప్రజల్లో అసంతృప్తి ఏర్పడింది. భాష పరస్పర వ్యవహారానికి, భావ వినిమయానికి జీవితంలోని ప్రతిరంగంలో ప్రత్యక్ష సంబంధం కలిగి ఉంటుంది. భాష నశిస్తే సమాజమే నశిస్తుంది. ఎంతో ప్రాముఖ్యత కల్గిన భాషా ప్రాతిపదికన ఏర్పాటైన రాష్ట్రాన్ని చీల్చేందుకు చేస్తున్న ప్రయత్నాలను ప్రతి తెలుగువాడు అడ్డుకోవాలి.

*పులిగండ్ల శ్రీనివాసులు* *అమెరికా*

### కసబ్‌ను శిక్షించండి!

ముంబైపై దాడిచేసి వందలకొద్దీ సామాన్యులను కాల్చి చంపిన ఉగ్రవాదుల్లో సజీవంగా పట్టుబడ్డ అజ్మల్ కసబ్ కేసు క్రింది కోర్టుల నుండి సుప్రీంకోర్టు దాకా నాలుగు సంవత్సరాలు నడిచి అంతిమంగా ఉరిశిక్ష విధించబడింది. కానీ ఈ శిక్ష అమలు జరుపలేదు. పార్లమెంట్‌పై దాడిచేసిన అఫ్జల్ గురు తరహాలో నాన్చివేతకు ప్రయత్నిస్తున్నారు. కసబ్ భద్రత కోసం ఇప్పటికే 100 కోట్లు ఖర్చు చేసి, ఇంకా అతడ్ని భరిస్తూ రాజభోగాలు సమకూరుస్తున్నారు. ఇంకెంత మంది సామాన్యులు ఉగ్రవాద చర్యలకు బలైతే మన ఏలికలకు చీమ కుడుతుందో?

*పి.అరుణకుమారి* *నెల్లూరు*

### ఆదాల కళాపీఠానికి అభినందనలు!

సింహపురి సీమలో గతంలో ఎన్నడూలేనివిధంగా కళాత్మక సాంప్రదాయ పూర్వ నృత్య కళాప్రదర్శనలు ఏర్పాటుచేసిన ఆదాల కళాపీఠం నిర్వాహకులకు అభినందనలు. ఈ నృత్యకళా ప్రదర్శనలు నెల్లూరీయులను ఎంతగానో అలరించాయి. ముమ్ముందు కూడా ఆదాల కళాపీఠం బహుకళారూపాలను నెల్లూరీయుల ముందుకు తెచ్చి చరిత్రలో ఆదాల సోదరుల పేరు నిలబడేట్లు చేసుకుంటారని ఆశిస్తున్నాను.

*రాంజీ* *కట్టుబడిపాళెం*

## 70 ఏళ్ల క్రితం ఈవారం

**20-10-1942**
**పేజీలు : 8 వెల: అణా**

### ఏడుకొండలవాడా వెంకటరమణా

*హిందూ గొరైల్నే కాదు బ్రిటీషు*
*సింహాన్ని గూడా నీ కొండకు*
*రప్పించు కొన్నావా?*
*ఎంత టక్కరి వాడవయ్యా!!*

–విమర్శకుడు

యేడు కొండల వాడా వెంకటరమణా చేదుకో చేదుకో అని ముసలీ ముతకా మోకాళ్లు బట్టుకొని, యేడు కొండలు ఎక్కి వెంకటేశ్వరుని సన్నిధికి చేరేవారు ఈనాటిదాకా. ఇహ ఆ బాధ తీరిపోయింది. యుద్ధం ఆగితే గీగితే, బస్ సర్వీస్ వేస్తే గీస్తే మనం అనే వాళ్లం ఉంటే గింటే, ఇక ఛణంలో వెళ్లి ఛణంలో రావచ్చు–

ఇప్పుడు దేవాలయ కమిటీవారు 6 లక్షలు ఖర్చుచేసి మోటారు కార్లు, బస్సులు వాయువేగ మనోవేగాలతో పరిగెత్తడానికి 27 అడుగుల వెడల్పు, 11 1/2 మైళ్ల పొడుగున ఒక రోడ్డు నిర్మించారు. చుట్ట యినా సులువైన దారిని బొమ్మని. ఘనత వహించిన గవర్నర్ శ్రీమాన్ హోష్ దొరగారు సపత్నికంగా విచ్చేసి స్వస్తిశ్రీ తారణ, చైత్ర బహుళ విదియ సోమవారము స్వాతీ నక్షత్రయుక్త పుష్కరాంశమున అంటే ఏప్రెల్ 10వ తేదీన ఈ రస్తా ప్రారంభోత్సమును తన బంగారు క్రైస్తవ హస్తంతో జరిపి హిందూ దేవుడ్ని, హిందూ మతాన్ని పునీతం చేసి చరితార్థుడైనాడు. అంతేగాదు తన స్వంత కారులో గవర్నరు వధూవరులు కొత్త రోడ్డు మీద కొండ దేముని సన్నిధికి ప్రథమ యాత్రజేసి దేవుని మన్ననలందారు. వీరు తలనీలాలివ్వలేదు. పంగనామాలు పెట్టలేదు. తులసి పూసలు ధరించలేదు. దబ్బిచ్చి ఫలాని పని చేయించుకోలేదు.

(తిరుమల తిరుపతి రోడ్డు ప్రారంభోత్సవం సందర్భంగా రామానాయుడు గారు వ్రాసిన వార్తయిది)

– సంపాదకుడు

## 50 ఏళ్ల క్రితం ఈవారం

**125-10-1962**
**పేజీలు: 12 వెల: 0-20 న.పై**

### గాల్ బ్రెయిత్ ఉడుత భక్తి!

అమెరికా సాంకేతిక బృందంతో నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిర్మాణాన్ని చూచిన రాయబారి ఆచార్య గాల్ బ్రెయిత్ స్వయంగా ఒక టకారా కాంక్రీటును నెత్తిన బెట్టుకొని, ఇతర కార్మికులతోపాటు తాను సారవలు ఎక్కి, ఆ కాంక్రీటు నిర్మాణంలో ఉన్న ఆనకట్ట గోడమీద క్రుమ్మరించి, ఉడుత భక్తిని ప్రదర్శించి చరితార్థుడైనాడు.

తేనె పుట్ట వలె ఊపిరి సలుపకుండా వేలాది కార్మికులతో శరవేగంగా జరుగుతున్న నాగార్జునసాగర్ నిర్మాణం చూస్తే ఎవ్వరికైనా యిలాంటి ఉత్సాహమే కలుగుతుంది.

### నెల్లూరులో వాలిన దేవేంద్ర భవనమా?

ఆంధ్రా జిల్లాలలోనే అపూర్వమైన అందాలు చిందే ఎయిర్ కండిషన్ థియేటరుకు, జలవిద్యుచ్ఛాఖామాత్యులు ఎ.సి.సుబ్బారెడ్డి విజయదశమి శుభ దినమున ప్రారంభోత్సవం గావించారు.

మంత్రులకు, సదస్సులకు మరుపూరు కోదండరామిరెడ్డి గారు స్వాగత వచనాలు పలుకుతూ శ్రీరామ్ థియేటరు నెల్లూరులో వాలిన ఇంద్రుని రాజభవనంలోని ఒక భాగమా అన్నట్లుగా ఉన్నదని అభివర్ణించారు. రెండు థియేటర్లు నిర్మించదగిన ధనాన్ని, యజమానులు ఈ ఒక్క థియేటరు మీదనే వెచ్చించారని, ప్రతి సీటుకు 200 రూపాయలు యెక్కువగా ఖర్చు పెట్టారని, స్వర్గతుల్యమైన శైత్యోపచార సమన్వితమైన ఈ థియేటరు గర్వించదగినదని కోదండరామిరెడ్డి గారు వెలిబుచ్చారు.

# నెల్లూరు ముచ్చట్లు

## ఇష్టమొచ్చినట్లు విద్యుత్ కోత!

నెల్లూరు నగరంలో 7వ తేది నుంచి విద్యుత్ కోత వేళలు మారిపోయాయి. గతంలో ఉదయం ఏడు గంటల నుంచి తొమ్మిదిన్నర వరకు, సాయంత్రం మూడున్నర నుంచి ఆరు వరకు ఐదు గంటల పాటు విద్యుత్ కోత విధించేవారు. ఆదివారం నుంచి ఈ కోత వేళలు ఇంకాస్త పొడిగించారు. ఉదయం ఏడుగంటలకు ఆగిన విద్యుత్ సరఫరా పది గంటలకుగానీ పునరుద్ధరించడం లేదు. మధ్యాహ్నం వేళ మూడు గంటలకే విద్యుత్ సరఫరా ఆపి నగరాన్ని స్తంభింపజేస్తున్నారు విద్యుత్ శాఖాధికారులు.

## అజ్ఞాతంలో డాక్టర్ కృష్ణమూర్తి!

నెల్లూరు పెద్దాసుపత్రి బ్లడ్ బ్యాంక్ ఇన్‌ఛార్జ్‌గా ఉంటూ ఒక పద్ధతి ప్రకారం రక్తం ప్యాకెట్లను అమ్మి సొమ్ము గడించిన డాక్టర్ కృష్ణమూర్తి అరెస్ట్‌కు వెరసి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. పోలీస్ దర్యాప్తులో ఆయన పాత్ర వెల్లడి కావడం, ముందస్తు బెయిల్‌కు ఆయన చేసిన ప్రయత్నాలు బెడిసి కొట్టడంతో కనపడకుండా వెళ్లిపోయారాయన. పెద్దాసుపత్రి బ్లడ్‌బ్యాంక్ నేతృత్వంలో పెద్ద పెద్ద రక్తదాన శిబిరాలు జరిగిన మరుసటి రోజు కూడా ఈ బ్లడ్ బ్యాంక్‌లో రక్తనిల్వలుండేవి గావని ఈ ఆసుపత్రికి మోటివేటర్‌గా పనిచేసిన ప్రముఖ రక్తదాత 'జమీన్‌రైతు' ప్రతినిధికి స్వయంగా చెప్పడాన్ని చూస్తే ఇక్కడ రక్తం ప్యాకెట్ల అక్రమ వ్యాపారంలో డాక్టర్ కృష్ణమూర్తి లక్షలాది రూపాయలు సంపాదించారని చెప్పక తప్పదు.

## కిలో బియ్యం 36 రూపాయలు!

నెల్లూరు మార్కెట్‌లో బియ్యం రేట్లు గతవారం రోజులుగా విపరీతంగా పెరిగిపోయాయి. జిలకర మసూరి రకం బియ్యం కిలో 36 రూపాయలమ్ముతున్నాయి. ఇది ఈ వారం ధరేనని వచ్చేవారం నలభై రూపాయలవుతాయంటున్నారు బియ్యం వ్యాపారస్తులు. ఏ ఉపద్రవమొచ్చి బియ్యం రేట్లు పెరుగుతున్నాయో అర్థం కావడం లేదు. జాయింట్ కలెక్టర్, పౌరసరఫరాల శాఖాధికారులు బియ్యం రేట్లు పెరగడంపై స్పందించి రైసు మిల్లర్లు, బియ్యం స్టాక్ చేసిన వ్యక్తులపై దాడులు చేయాల్సిన బాధ్యతలేదా?

## గ్రామాల అభివృద్ధికి ముందుకు రావాలి!

పుట్టి పెరిగిన ఊరికి, ప్రజలకు సేవచేస్తున్న బద్దెవోలు శ్రీహరిరెడ్డి వంటి వ్యక్తులు ప్రతి గ్రామంలో ఉంటే ఆ ఊరి రూపురేఖలు మారిపోతాయని జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్‌రెడ్డి చెప్పారు. మనుబోలు మండలం వీరంపల్లి గ్రామంలో 7వ తేది బద్దెవోలు మస్తాన్‌రెడ్డి – రుక్మిణమ్మల జ్ఞాపకార్థం వారి కుమారుడు శ్రీహరిరెడ్డి నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రజలకు మంచి సేవ చేయాలనే తలంపు కొంతమందికే ఉంటుందని, దీనికి గ్రామంలో శ్రీహరిరెడ్డి నిర్మించిన మరుభూమి ప్రత్యక్ష ఉదాహరణ అన్నారు. ఈ మరు భూమిని ఎస్పీ బి.వి.రమణకుమార్ ప్రారంభించారు. స్కూల్ పిల్లలకు ఫర్నిచర్ సమకూర్చడం ఆయన దొడ్డ మనసును వెల్లడి చేస్తుందన్నారు. వైద్య శిబిరంలో నెల్లూరు మాడరన్ కంటి వైద్యశాలకు చెందిన డాక్టర్లు పి.ఎల్.రావు, పి.భారతి, కృష్ణ మూర్తి, గుండె డాక్టర్ పి.మురళీ శంకర్ రెడ్డి, దంత వైద్యులు గోకుల్ చంద్రా రెడ్డి, ఎం.రజని, శంకర్ నేత్రాలయ డైరక్టర్ కె.జగదీష్‌రెడ్డి, మణిమాల, డాక్టర్ బి.రాజశేఖర్‌రెడ్డి, డాక్టర్ కె.ఎన్.రెడ్డి, శ్రీహరిరెడ్డి సతీమణి కృష్ణవేణమ్మ, నెల్లూరు రోటరీ క్లబ్ అధ్యక్షులు కె.మధుసూధనరావు, కార్యదర్శి ఎస్.రాఘవేంద్ర షెట్టి తదితరులు పాల్గొన్నారు. శిబిరంలో 750 మంది రోగులను పరీక్షించి మందులు పంచి పెట్టడంతోపాటు భోజన వసతి కూడా కల్పించారు.




**నెల్లూరు టౌన్‌హాల్‌లో జరిగిన సభలో కవి శారదాకుమార్ రచించిన సామ్యగానం, హారతి మానవతా పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఆచార్య ఎం.ఎల్.కాంతారావు, విదుషీమణి, పెరుగు రామకృష్ణ, బి.సాయికుమార్‌రెడ్డి.**

## అమ్మ ఫర్నిచర్ మాల్ ఇంటర్నేషనల్ ఎక్స్‌పో!

నెల్లూరు మినీ బైపాస్ రోడ్డులోని జిపిఆర్ కళ్యాణ మండపంలో అమ్మ ఫర్నిచర్ మాల్ నేతృత్వంలో ఇంటర్నేషనల్ ఫర్నిచర్ ఎక్స్‌పో – 2012, 11వ తేదీ ప్రారంభమయ్యింది. ఈ ఎగ్జిబిషన్‌లో మలేషియా, తైవాన్, హాంకాంగ్, ఇండోనేషియా, ఇటలీ, దుబాయ్ వంటి దేశాల నుంచి దిగుమతి చేసుకొన్న కొన్నివేల రకాల ఫర్నిచర్‌ను ప్రదర్శనకు ఉంచారు. వీటిలో లివింగ్ రూమ్ యూనిట్, బెడ్ రూమ్ యూనిట్, డైనింగ్ టేబుల్స్, బెర్త్స్, సోఫాసెట్లు ప్రత్యేకంగా ఆకట్టుకొంటున్నాయి. విడిగా డబుల్, సింగిల్ కాట్ బెడ్స్, సోఫాసెట్స్, ఆఫీస్ ఛైర్స్, కంప్యూటర్ ఛైర్స్, టీవీ స్టాండ్స్, డ్రస్సింగ్ టేబుల్స్, కళ్లు చెదిరే మాడల్స్‌లో కనువిందు చేస్తున్నాయి. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ యేడాది ఎక్స్‌పోను ఏర్పాటు చేశామని అమ్మ ఫర్నిచర్ మాల్ అధినేత గడ్డం సుధాకర్‌రెడ్డి చెప్పారు. దీనిలో కొనుగోలు చేసిన వారికి గిఫ్టలతోపాటు, బంపర్ డ్రా గిఫ్ట్ కూపన్ కూడా ఇస్తామని, డ్రాలో గెలుపొందిన విజేతలకు ఆపిల్ – ఐ ఫోన్‌ను బహుమతిగా ఇస్తున్నామన్నారు. ఈ ఎగ్జిబిషన్ 11వ తేది నుంచి 14వ తేది వరకు ఉంటుందని, నెల్లూరీయులు ఈ అవకాశాన్ని వినియోగించుకోమంటున్నారు.

కొరవ 14వ పేజీలో















## • కార్పొరేషన్‌లో
# ప్రతి పనికోరేటు!

### ఈ దందాలోనే అన్ని విభాగాలు

నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలో అవినీతి, అక్రమం రాజ్యమేలుతున్నాయి. ఇక్కడి సిబ్బంది ప్రతి పనికోరేటు ప్రకటించి వసూళ్లకు పాల్పడుతున్నారు. జనన సర్టిఫికేటు అర్జంటుగా కావాలంటే 500, మరణ సర్టిఫికేటుకు 2,500 రూపాయలు వసూలు చేస్తున్నారు. వంద చదరపు మీటర్ల ఇంటి ప్లాన్ ఆమోదానికి సిటీ ప్లానింగ్ శాఖాధికారులు 15వేల నుంచి 25వేల రూపాయల వరకు మామూళ్లు వసూలు చేస్తున్నారు. కమర్షియల్ భవనాలు, అపార్ట్‌మెంట్స్, లేఅవుట్ల ప్లాన్‌ను ఓకే చేయడానికి ఒక రూమ్ లేదా అపార్ట్‌మెంట్ లేదా ఆ ప్రాంతంలో మార్కెట్ రేటు ప్రకారం చెల్లింపులు వారు చెప్పిన వారికి చేయాలి. లేకుంటే అనుమతులు ఇవ్వరు. మాగుంట లేఅవుట్‌లో 700లకు పైగా అపార్ట్‌మెంట్స్ ఉంటే వీటిలో నిబంధనల ప్రకారం నిర్మించినవి రెండు వందలే కావడం గమనార్హం. ఇంజనీరింగ్ సెక్షన్‌లో తిమ్మిని బమ్మిని చేసే ఘనులున్నారు. దీనివల్లే నగరంలో మునిసిపల్ ఇంజనీర్ల పర్యవేక్షణలో నిర్మించే రోడ్లు, భవనాలు నాలుగు నెలలకే దెబ్బతిని పోతున్నాయి. వీరెంతగా గుండెలు తీసిన బంటులంటే కార్పొరేషన్ నూతన భవనం గేటుకు ఉత్తరంగా గతంలో గోడ నిర్మించి ఉన్నా 200 మీటర్ల గోడ కొత్తగా కట్టి నట్లు బిల్లులు పెట్టి లక్షలాది రూపాయల ప్రజల సొమ్ము తమ జేబుల్లో వేసుకొన్నారు. కార్పొరేషన్ సిబ్బంది చేతులమీదుగా ప్రతినెలా 1వ తేది పంచుతున్న వృద్ధాప్య, వితంతు, వికలాంగ పెన్షన్లు 90 లక్షల రూపాయల్లో పది లక్షల రూపాయలు సిబ్బంది ఒక పథకం ప్రకారం నొక్కేస్తున్నట్లు ఆడిట్ అధికారుల పరిశీలనలో తేలినా చర్యలు తీసుకొనే వారే లేరు. పారిశుద్ధ్య, ప్రజారోగ్య విభాగంలో ప్రతినెలా లక్షలాది రూపాయలు దొంగ బిల్లులతో నిధులు భోంచేస్తున్నా అడిగేవారే లేరు. కార్పొరేషన్ కమిషనర్‌కు కార్పొరేషన్‌లో జరిగే ప్రతి పైసా వసూలులోనూ వాటా వెళ్లిపోతుంది. ప్రత్యేకాధికారి లక్ష్మీకాంతంకు ఇక్కడ జరిగే ప్రతి దోపిడీ వ్యవహారం తెలుసు. కానీ ఆయన పత్రికలు, ఛానళ్ల ముందు 'కఠిన చర్యలు తప్పవు' అనే డైలాగుకే పరిమితమై పోతున్నారు. ప్రజలు క్రమం తప్పకుండా పన్నుల రూపేణా కట్టే కోట్ల రూపాయలే గాక అక్రమ, మార్గాన లెక్కలేనంతగా దోచేస్తున్నారు కార్పొరేషన్ సిబ్బంది. ఈ పాపం బద్దలయ్యేది ఎప్పుడో? ఈ పాపాల భైరవులపై చర్యలెప్పుడో?



పాత గోడనే కొత్త గోడ నిర్మించామంటూ బిల్లులు చేసుకున్న వైనం.

## • విక్రమ సింహపురి యూనివర్శిటీలో...
# విద్యార్థినుల కష్టాలు వర్ణనాతీతం!



దుస్థితిలో మరుగుదొడ్లు.

విక్రమ సింహపురి యూనివర్శిటీ బాగోగులు పట్టించుకునే వారే లేకుండా పోవడంతో అక్కడ చదివే యువతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. యూనివర్శిటీకి సంబంధించి పూర్తిస్థాయిలో భవన నిర్మాణం జరగకపోవడంతో తాత్కాలికంగా తరగతులను విఆర్ హైస్కూల్ మిద్దెపైన గల గదులలో నిర్వహిస్తున్నారు. తరగతుల వరకు ఎలాగోలా జరుపుతున్నా యువతులను దృష్టిలో పెట్టుకొని టాయిలెట్లను ఏర్పాటు చేయకపోవడంతో వీరు ఇక్కట్లు పడాల్సి వస్తోంది. యువతీ, యువకులకు టాయిలెట్లను విఆర్ చిల్డ్రన్స్ అకాడమీ ఉండిన ప్రాంతంలో కొసన ఏర్పాటు చేశారు. ఇక్కడే అసలు సమస్యను ఎదుర్కొంటున్నారు. పురుషులకు, స్త్రీలకు ప్రక్కప్రక్కనే మరుగుదొడ్లను ఏర్పాటు చేసినప్పటికీ నీటి సౌకర్యం సరిగా లేకపోవడం, కేవలం పురుషుల కోసం ఉండే టాయిలెట్లలోనే బక్కెట్, మగ్గు ఉండడంతో యువతులు అత్యవసర సమయాల్లో అక్కడి వస్తువులను వినియోగించుకోవాల్సి రావడంతో ఇబ్బంది పడుతున్నారు. దీనికితోడు టాయిలెట్ల గోడలపైన సందు ఉండడంతో పోకిరీలు అక్కడకు వచ్చే మహిళలను వేధిస్తుండడంతో మరుగుదొడ్లకు పోవాలంటేనే యువతులు హడలి పోతున్నారు. ఇటీవల కొందరు విద్యార్థినులు బాత్‌రూంకు వెళ్లిన సమయంలో బయటి వ్యక్తులు అక్కడ చేరి సెల్‌ఫోన్‌లో చిత్రీకరించడం చూసిన యువతులు పెద్దగా అరవడంతో వాళ్లు పరుగెత్తి పారిపోయారట. ఈ ఘటన కలకలం రేపింది. ఆనాటి నుంచి యువతులు కళాశాల వెనుకవైపున ఏర్పాటుచేసి ఉండే టాయిలెట్లకు వెళ్లాలంటేనే హడలి పోతున్నారు. నిత్యం అది చేస్తాం, ఇది చేస్తాం, యూనివర్శిటీని అభివృద్ధి చేస్తున్నాం అని చెప్పే యూనివర్శిటీ ఉన్నతాధికారులకు ఇక్కడ చదివే యువతులు ఎదుర్కొంటున్న బాధలు పట్టడం లేదు.

# ఉపాధ్యాయ సంఘాలు పలుచనయ్యాయి!

### రకరకాలుగా విడిపోయారు

పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు విద్యాబుద్ధులు చెప్పాల్సిన ఉపాధ్యాయులు ఎవరికి వారు యూనియన్లు, వర్గాలు, గ్రూపులుగా విడిపోయి కుమ్ములాడుకొంటుండడం విద్యావ్యవస్థను భ్రష్టుపట్టిస్తోంది. ఉపాధ్యాయ సంఘాల్లో ఆధిపత్యపోరు చాలాకాలం నుంచి ఉన్నా తమ స్వార్థం కోసం, స్వప్రయోజనాల కోసం అధికారుల కొమ్ము కాసేవారు కొందరైతే, అదే అధికారికి వ్యతిరేకంగా పోరాటం చేసేవారు మరికొందరు. రాజకీయ పార్టీలు, నాయకులకు తామేమీ తీసిపోమన్న చందంగా నిన్నమొన్నటి వరకు అధికారులతో స్నేహభావంగా మెలిగినవారు విరోధులుగా మారితే అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్న మరికొందరు అదే అధికారితో చెట్టాపట్టాలేసుకొని తిరగడం, వారికి మద్దతుగా నిలబడడం ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల్లోని రాజకీయ కోణాన్ని తెలియజెప్తోంది. ఇటీవల జిల్లా విద్యాశాఖాధికారితో ఉపాధ్యాయ సంఘాల వ్యవహారశైలి దీనికి నిదర్శనం. పలు ఉపాధ్యాయ సంఘాలు విద్యాశాఖాధికారికి వ్యతిరేకంగా ఆందోళన చేయగా, కొన్ని ఉపాధ్యాయ సంఘాలు ఆ అధికారి ప్రక్కన చేరి మద్దతిచ్చాయి. ఒకటి రెండు ఉపాధ్యాయ సంఘాలు ఎటువైపూ మొగ్గుచూపక తటస్థంగా వ్యవహరించాయి. తమ మాట ఖాతరు చేయలేదని కొన్ని ఉపాధ్యాయ సంఘాలు రోడ్డుపైకి రాగా, మరికొందరు తమకు లబ్ధి చేకూరడంతో అధికారి పంచన చేరడడంతో ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇందులో నిజానిజాల సంగతి ప్రక్కనబెడితే ఉపాధ్యాయ సంఘాల మధ్య ప్రధాన అంశాలపై పోరాటం చేయడంలో సఖ్యత కొరవడడం, ఎవరికి వారు సొంతంగా, స్వలాభం కోసం ఇతరత్రా ప్రయోజనాలను ఆశించి ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు కార్యక్రమాలు నిర్వహిస్తుండడం ఉపాధ్యాయ సంఘాలను జనంలో పలుచన చేస్తోంది. ఎవరి సిద్ధాంతాలు, నిర్ణయాలు ఎలా ఉన్నా నిబద్ధతగా వ్యవహరించకపోవడం విమర్శల పాలవుతోంది.

# తెలుగుదేశం అధ్యక్షుడెవరు?

### • బీద రవి వైపే మొగ్గు

తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్ష బాధ్యతలు ఎవరు చేపడుతారో అన్న అంశంపై సందిగ్ధత నెలకొనింది. ప్రస్తుత అధ్యక్షునిగా ఉన్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఈ బాధ్యతల నుంచి తప్పుకొని పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యునిగా వెళ్లాలన్న కోరిక వెలిబుచ్చుతున్నారు. ఆయన కాకుంటే తర్వాత ఎవరు ఆ బరువు బాధ్యతలు ఎవరు మోస్తారో అన్న దానిపై తీవ్రమైన చర్చ జరుగుతోంది. కోవూరు ఉప ఎన్నిక, నెల్లూరు పార్లమెంటుకు జరిగిన ఉప ఎన్నికల్లో పార్టీ ఓటమి చెందడంతో పార్టీ శ్రేణులు డీలా పడ్డాయి. సంస్థాగత ఎన్నికలు నిర్వహించే గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాల్సి ఉన్నా ఎప్పటికప్పుడు వాయిదా పడుతూ వస్తున్నాయి. గత ఏడాది జిల్లా పార్టీ బాధ్యతల నుంచి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తప్పుకోవాలనుకొన్నారు. అయితే రాష్ట్ర అధ్యక్షుని ఆదేశాల మేరకు తిరిగి జిల్లా పగ్గాలు చేపట్టి కొనసాగుతున్నారు. తాజాగా జరిగే మార్పు చేర్పుల్లో జిల్లా బాధ్యతల నుంచి తప్పుకొని తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షునిగా ఉన్న బీద రవిచంద్రకు ఆ బాధ్యతలు అప్పగించాలన్న ఆలోచన సోమిరెడ్డిలో ఉంది. అయితే దేశం శ్రేణులు, ఆ పార్టీ శాసనసభ్యులు ఈ మార్పుకు ససేమిరా అంటున్నారు. 2014 వరకు సోమిరెడ్డే జిల్లా అధ్యక్షునిగా కొనసాగాలని, అట్లయితేనే పార్టీ బలం పుంజుకొంటుందని అభిప్రాయపడుతున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీతోపాటు బలంగా ఉన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని ధీటుగా ఎదుర్కొని నెగ్గుకురాగల నేర్పు, పార్టీ క్యాడర్‌ను సమన్వయం చేసే చాతుర్యం సోమిరెడ్డికే ఉన్నందున ఆయన్ను తిరిగి పార్టీ అధ్యక్షుడిగా కొనసాగించాలన్నది మెజార్టీ సభ్యుల అభిప్రాయం. ఈ పరిస్థితుల్లో సోమిరెడ్డి తిరిగి బరువు బాధ్యతలు మోస్తాడా? లేక చిరకాల కోరికగా ఉన్న పార్టీ పొలిట్ బ్యూరో స్థానం సంపాదిస్తాడా అనేది 17వ తేదీ జరిగే జిల్లా అధ్యక్ష ఎన్నిక రోజు తేలిపోనున్నది.

# ఇసుక అక్రమ రవాణాదారులకు జైలు శిక్ష!

### • అక్రమార్కులు మారేనా?

నెల్లూరు రూరల్ మండలం కోడూరుపాడు ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడ్డారని నమోదైన కేసులో నిందితుడు రమేష్‌తో సహా 11 మందికి ఏడాది జైలు శిక్ష, ఒక్కొక్కరికి రెండు వేల రూపాయల జరిమానా విధిస్తూ ఎక్సైజ్ మేజిస్ట్రేట్ కాంతిమతి తీర్పు చెప్పారు. 2010 డిసెంబర్ 22వ తేదీన నిందితులు తమ్మి ప్రభాకర్, ఎం.కృష్ణారెడ్డి, గుంజి శ్రీహరి, వెంకట శేషయ్య, కె.వెంకట సుబ్బారెడ్డి, వి.వెంకటేశ్వర్లు, ఈదూరు వినోద్, పోలయ్య, డి.నాగరాజు, గుర్రం రామ్మోహన్, బోడెద్దుల గోవర్ధన్ చట్టవిరుద్ధంగా ఇసుక రీచ్ నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేశారని నెల్లూరు రూరల్ పోలీసులు నిందితులపై కేసు నమోదు చేసి ఛార్జిషీటు దాఖలు చేశారు.

కోడూరుపాడు రీచ్ ఇప్పటికే అక్రమ ఇసుక రవాణాకు కేంద్రంగా భాసిల్లుతుంది. ఈ తీర్పుతోనైనా అక్రమార్కుల వైఖరిలో మార్పు ఏదైనా వస్తుందేమో చూడాలి.

## కోట ఎస్‌ఐని వీధులపాలు చేసిన ప్రేయసి!

### గ్రామంలో శాంతిభద్రతల సమస్య

విధి నిర్వహణలో ప్రజల మన్ననలందుకొన్న కోట పోలీస్ సబ్ ఇన్స్‌పెక్టరుకు ప్రేమ వ్యవహారం తంటాలు తెచ్చింది. ఇక్కడ ఎస్‌ఐగా పని చేస్తున్న వెంకటరమణ కరకుగా డ్యూటీ చేయడంతో స్థానికుల ఆదరాభిమానాలు పొందాడు. శాంతిభద్రతలను కాపాడడంలో రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా వ్యవహరించడం, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజలతో సత్సంబంధాలు కలిగివుండడంతో అందరూ అతన్ని అభిమానించారు. అలాంటి వ్యక్తిపై నాయుడుపేట మండలం మర్లపల్లి గ్రామానికి చెందిన నరసమ్మ అలియాస్ నందిని తనను వివాహం చేసుకొంటానని నమ్మించి గర్భవతిని చేసి మోసం చేశాడని ఆరోపించడంతో కలకలం రేపింది. ఈ విషయమై ఫిర్యాదు చేసేందుకు వాకాడు సిఐ శ్రీనివాసరావు వద్దకు వచ్చింది. పోలీస్‌స్టేషన్‌లో ఇలాంటి కేసులు నమోదు కావడం సర్వసాధారణమే అయినా ఫిర్యాదు తమ పోలీస్ పైనే అనేటప్పటికి ఏం చేయాలో పాలుపోలేదు. విషయం తెలుసుకొన్న స్థానికులు, పెద్ద సంఖ్యలో మహిళలు ఎస్‌ఐకు మద్దతుగా నిలిచారు. నిఖార్సుగా డ్యూటీచేస్తూ, బెల్టుషాపులు మూయించి తమ సంసారాలను నిలబెట్టాడని అలాంటి ఎస్‌ఐపై కొందరు నేతలు అనవసరంగా బురదచల్లేయత్నం చేస్తున్నారని ఆగ్రహించారు. మరోవైపు నందినికి మద్దతుగా మరికొందరు ఆందోళన జరిపి ఎస్‌ఐ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. దీనిపై సిఐ శ్రీనివాసరావు తొందరపడకుండా కేసును కూలంకషంగా విచారించి న్యాయం చేస్తామని చెప్పి ఇరువురిని సర్దుబాటు చేయడంతో తాత్కాలికంగా వివాదం సర్దుమణిగింది. గతంలో సంగం ఎస్‌ఐ రంగనాధ్‌గౌడ్ ప్రేమ వ్యవహారం రచ్చకెక్కడం తెలిసిందే. తాజాగా కోట ఎస్‌ఐపై ఒక యువతి ఫిర్యాదు చేయడంతో పోలీసులకు ప్రేమ వ్యవహారం చిక్కులు తెచ్చిపెడుతోంది.

## బిఎంఆర్‌ది ఒంటికన్ను సిద్ధాంతం!

తెలుగుదేశం పార్టీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నేతలు పలు భూ ఆక్రమణలకు పాల్పడ్డారని అలాంటివి కావలి శాసనసభ్యుడు బీద మస్తాన్‌రావుకు కన్పించవా అని వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ నేత రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. అధికారాన్ని తన చేతుల్లోకి తీసుకొని ఎమ్మెల్యే కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్లు కూల్చివేత ఘటనపై ఆయన ఎమ్మెల్యే తీరును తప్పుపట్టారు. పేదలు పైసాపైసా కూడబెట్టుకొని ఇళ్లు ఏర్పడుతుందని భావించి బేస్‌మెంట్‌లు కట్టుకొని, ఇళ్లు నిర్మించుకొంటే ఆక్రమణల పేరుతో, అనర్హులు

### విమర్శించిన రామిరెడ్డి ప్రతాప్‌రెడ్డి

ఇళ్లు పొందారనే సాకుతో వాటిని కూలగొట్టించడం దారుణమన్నారు. ఎమ్మెల్యే కక్ష సాధింపు చర్యలకు ఇది నిదర్శనం అన్నారు. అధికారులు కాకుండా అన్నీతానై వ్యవహరించి ఇళ్లు పడగొట్టించడం వల్ల పేదలు రోడ్డున పడ్డారన్నారు. ఎమ్మెల్యే అనుచరుడు 14వ వార్డు మాజీ కౌన్సిలర్ అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఆయనపై ఎందుకు చర్య తీసుకోలేదని ప్రశ్నించారు. అయినవాళ్లకు ఒక న్యాయం, కాని వాళ్లకు మరో న్యాయమా అని ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో జరిగిన అక్రమాలపై పూర్తి విచారణ జరిపి నిజానిజాలు నిగ్గు తేల్చాలని ఆయన డిమాండ్ చేశారు.

● దగదర్తిలో

## అందని రెవిన్యూ సేవలు!

దగదర్తి మండలంలోని ప్రజలకు రెవెన్యూ సేవలు అందడం లేదు. అధికారులు చుట్టపుచూపుగా వస్తుండడంతో వివిధ సమస్యలపై వచ్చే ప్రజలు రోజుల తరబడి అధికారుల దర్శనం ఎప్పుడు కల్గుతుందా అని చెట్ల క్రిందే పడిగాపులు కాయాల్సి వస్తోంది. ప్రజలకు అందుబాటులో వుండాల్సిన రెవెన్యూ సిబ్బంది ఆ సంగతి మరచి ప్రవర్తిస్తుండడంతో దగదర్తి మండల రెవెన్యూ కార్యాలయం ప్రజలకు అందుబాటులో వుండడం లేదు. చుట్టుప్రక్కల ప్రాంతాల నుంచి నిత్యం వందలాది మంది మండల కేంద్రానికి వివిధ పనులపై వస్తుంటారు. వీరిలో అధికభాగం ధృవీకరణ పత్రాల కోసం వచ్చేవారు, రైతులు, విద్యార్థినీ విద్యార్థులు వుంటారు. సక్రమంగా విధులకు హాజరు కావాల్సిన రెవెన్యూ సిబ్బంది తమ ఇష్టానుసారంగా ప్రవర్తిసుండడంతో ప్రజల బాధలు పట్టించుకొనేవారే లేకుండా పోయారు. అవినీతి పెరిగిపోయిందని కొందరు ఆర్ఐలు, విఆర్వోలు లంచం ముట్టజెప్పందే పనులు చేయడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. భూ సమస్యలపై అర్జీలు చేత పట్టుకొని సమస్యను తెలిపి న్యాయం చేయమని కోరేందుకు పలువురు కార్యాలయం వద్ద బారులు తీరుతున్నా వారి సమస్యలు పట్టించుకొనే నాధుడే లేకండా పోతున్నారు. రెవెన్యూ సిబ్బంది అడిగినంత ఇచ్చుకోలేకపోతే భూస్వాములకు అనుకూలంగా వ్యవహరిస్తూ తమకు అన్యాయం చేస్తున్నారని పేద ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు దృష్టికి తీసుకొనిపోయామని ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి రెవెన్యూ సిబ్బంది అందుబాటులో వుండేలా చూడాలని మండల ప్రజలు కోరుకొంటున్నారు.

● సముద్రంలో

## చేపల చెరువు విజయవంతం!

కావలి మండలం కొత్తపట్నంలోగల సముద్రంలో చేపల చెరువు ప్రయోగం విజయవంతమయ్యింది. చెన్నైకి చెందిన ఎల్ఐఓటి సంస్థ శాస్త్రవేత్తల సాంకేతిక పరిజ్ఞానంతో సముద్రంలో వలల సహాయంతో చెరువుగా మలచి అందులో చేప పిల్లలను వదిలారు. గాంధీ అగ్రికల్చర్ సెంటర్ నుంచి చేపపిల్లలను తెచ్చి పెంపకం చేపట్టగా అది మంచి ఫలితాలనిచ్చింది. ఈ సందర్భంగా గుంటూరు మత్స్యశాఖ జెడి బలరామనాయక్, శాస్త్రవేత్త కిడుబగరన్ మాట్లాడుతూ రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా ఈ ప్రయోగం చేపట్టామన్నారు. 1.5 టన్నుల చేపలను పట్టామని, ఈ విధానాన్ని మత్స్యకారులు అవలంభిస్తే కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని తెలిపారు. సముద్రంలో 20 కిమీ దూరం వరకు ఈవిధంగా కల్చర్ చేయవచ్చన్నారు. ఆయా ప్రాంతాల వాతావరణ పరిస్థితులను బట్టి పండగప్ప, కొబియా, గ్రాబర్ తదితరరకాల చేప పిల్లలను పెంచవచ్చన్నారు. అధికారులు ఈ విధానం మంచిదని ఆదాయం లభిస్తుందని చెప్తున్నప్పటికీ ఖర్చు అధికం, దానిపై వచ్చే ఆదాయం తక్కువని మత్స్యకారులు వ్యాఖ్యానిస్తున్నారు.

● భూ పంపిణీపై

## సోనియాగాంధీకి ఉత్తరాలు!

భూపంపిణీలో దళితులకు న్యాయం చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రజా భూహక్కుల వేదిక కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సోనియాగాంధీకి ఉత్తరాలు వ్రాసే కార్యక్రమాన్ని చేపట్టింది. వెంకటగిరి నియోజకవర్గ పరిధిలో వేదిక ఇన్‌చార్జి తుపాకుల శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఈ ఉత్తరాలు వ్రాసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులను ఆర్థికంగా అభివృద్ధి చేయాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఇప్పటికి ఐదు విడతల్లో భూపంపిణీ చేసినా దళితులకు న్యాయం జరగలేదన్నారు. ఇప్పటికీ అధిక సంఖ్యలో దళితులు భూస్వాముల వద్ద గ్రామాల్లో పనులు చేస్తున్నారని, అలాంటి వారిని రెవెన్యూశాఖ గుర్తించడం లేదన్నారు. భూస్వాములే బినామీ పేర్లతో భూములను దక్కించుకొంటున్నారని, ఈ సంగతి తెలిసినా రెవెన్యూశాఖ చూసీ చూడనట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. ఆరోవిడత భూపంపిణీలోనైనా దళితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇదే విషయాన్ని సోనియాగాంధీ దృష్టికి తీసుకవెళ్లేందుకు ఈ ఉత్తరాలు వ్రాసే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. వెంకటగిరి పోస్టాఫీసు వద్దకు అధికసంఖ్యలో చేరుకొని ఉత్తరాలు వ్రాసి పోస్టు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా భూహక్కుల వేదిక సభ్యులు సుబ్బరాయుడు, ఆవులయ్య, బాబు, పద్మయ్య, చెంచుకృష్ణయ్య, వెంకటేశ్వర్లు, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా వెంకటగిరి పోలేరమ్మ జాతర!



ఊరేగింపులో పోలేరమ్మ.

వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతర వైభవంగా జరిగింది. ప్రతి ఏడాది నిర్వహిస్తున్న విధంగానే ఈసారి సాంప్రదాయబద్ధంగా జాతరను నిర్వహించారు. జాతర ప్రారంభమైన అక్టోబర్ 3వతేది వెంకటగిరి చెరువు నుంచి బంకమట్టిని తీసుకవచ్చి అమ్మవారి పుట్టినిల్లుగా భావించే కుమ్మరి ఇంట్లో పోలేరమ్మ ప్రతిమను తయారు చేశారు. ఎలాంటి అలంకారం లేకుండా భక్తుల దర్శనార్థం వుంచి ఆ తర్వాత ఊరేగింపుగా అర్ధరాత్రి 12 గంటల సమయంలో అత్తవారిల్లుగా భావించే జీనిగలవారి వీధికి తీసుకొని వచ్చి బుగ్గచుక్కపెట్టి, కళ్లు అమర్చారు. అలంకారం పూర్తయిన తర్వాత అమ్మవారి విగ్రహాన్ని రథంపై వుంచి గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా వేలాదిమంది భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకొన్నారు. 4వతేది గురువారం సాయంత్రం సాంప్రదాయబద్ధంగా నిమజ్జనం చేయడంతో జాతర ముగిసింది. గత ఏడాది కంటే ఈ సంవత్సరం భక్తుల సంఖ్య పెరగడంతో వెంకటగిరి కిక్కిరిసిపోయింది. జాతరలో జంతుబలులు జరగకుండా ఎస్పీ రమణకుమార్ పెద్ద ఎత్తున పోలీసులను దించి కొంతమేర నివారించగలిగారు. అయితే సాంప్రదాయబద్ధంగా జరిగే బలులన్నీ గుట్టుచప్పుడు కాకుండా జరిగిపోయాయి. పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకొన్నారు.

## పర్యాటక కేంద్రంగా ఇస్కపల్లి!



పాఠశాలకు శంకుస్థాపన చేస్తున్న బీద మస్తాన్‌రావు.

ఇస్కపల్లి పాళెం తీరాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు కావలి శాసనసభ్యుడు బీద మస్తాన్ రావు ప్రకటించారు. ఈ ప్రాంతంలో ఏర్పాటవుతున్న పాఠశాల భవనాలను శంకుస్థాపన చేశారు. తీరంలో మెరైన్ పోలీస్ స్టేషన్ భవనానికి నిధులు మంజూరయ్యాయన్నారు. దీనికి స్థలం ఇచ్చేందుకు మత్స్యకారుల సహకారం అవసరమన్నారు. కాలనీలో అంతర్గత రోడ్ల నిర్మాణం కోసం కోటి రూపాయలతో ప్రతిపాదనలు పంపామన్నారు. 15.9లక్షల రూపాయలతో పాఠశాల భవనాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇస్కపల్లి పంచాయితీ పరిధిలోగల కుర్రులబ్బీ ఇస్లాం పాళెంలో పాఠశాల భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి బీద గిరిధర్, మాజీ సర్పంచ్ రషీద్, అల్లూరు ఎమ్మార్వో శ్రీనివాసులరెడ్డి, ఎఇ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



విదేశీ పర్యటనను పూర్తిచేసుకొని వచ్చిన గూడూరు వైకాపా నాయకుడు బత్తిని విజయకుమార్‌కు అభినందనలు తెలియజేస్తున్న ఆ పార్టీ నాయకులు పడియాల శ్రీహరి, పెళ్లూరు ఉదయభాస్కర్.



వీరంపల్లిలో మెగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్‌రెడ్డి. ప్రక్కన ఎస్పీ రమణకుమార్, శిబిర నిర్వాహకుడు శ్రీహరిరెడ్డి.

## ఫిజియోథెరఫీతో ప్రయోజనం

ఫిజియోథెరఫీ ద్వారా వికలాంగులకు ప్రయోజనం చేకూరుతుందని రాజీవ్ విద్యామిషన్ ఎఎంఓ బాలాజీరావ్ తెలిపారు. వెంకటాచలం మండలం మానవ వనరుల కేంద్రంలో వికలాంగులకు చేస్తున్న ఫిజియోథెరఫీ చికిత్సలను పరిశీలించారు. ప్రతి శుక్రవారం వైద్య శిబిరాల ద్వారా చికిత్స జరుపుతున్నామన్నారు. చికిత్సకు వచ్చిన వారికి రవాణా ఖర్చులను చెల్లిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ రవీంద్రరెడ్డి, ఫిజియోథెరఫిస్ట్ ప్రశాంతి, కరీంబాషా తదితరులు పాల్గొన్నారు.

# భూ నిర్వాసితులకు అండగా నిలుస్తాం!

**తోటపల్లిగూడూరులో మాజీ ఎమ్పీ మధు**

భూములు కోల్పోయిన నిర్వాసితులకు పూర్తి పరిహారం అందేలా ప్రభుత్వంతో మాట్లాడుతామని సిపిఎం కేంద్రకమిటి సభ్యుడు పి.మధు హామీ ఇచ్చారు. తోటపల్లి గూడూరు మండపం పంచాయితీ పరిధిలో నెల్‌కాస్ట్ ఎనర్జీ కార్పొరేషన్ పవర్‌ప్లాంటు ద్వారా సేకరించిన భూముల విషయమై ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డితో తమ పార్టీ చర్చిస్తుందన్నారు. సాలిపేటలో జరిగిన నిర్వాసితుల సదస్సులో ఆయన పాల్గొన్నారు. బ్రతుకు తెరువు కోల్పోయిన అన్ని గ్రామాల ప్రజలకు ప్రత్యేక ప్యాకేజీ క్రింద లక్షరూపాయల వంతున చెల్లించాలని డిమాండ్ చేశారు. మండపం పంచాయితీ, వరకవిపూడి, అనంతపురం, పైనాపురం గ్రామాలకు సంబంధించిన ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ఈ కంపెనీ భూసేకరణలో భారీ అవినీతి జరిగినట్లు వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. ప్రభుత్వం నుంచి సేకరించిన 865 ఎకరాలలో చాలావరకు పరిహారం అందలేదని సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్ర రాజగోపాల్ తెలిపారు. ఇప్పటివరకు కేవలం 500 ఎకరాలకు మాత్రమే పరిహారం ఇచ్చారన్నారు. మిగిలిన




వాటి గురించి పట్టించుకోవడం లేదన్నారు. సిఐటియూ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రావు మాట్లాడుతూ ఈ భూపరిహారంలో 150 ఎకరాలకు చెందిన మూడు కోట్ల రూపాయలు బినామీలకు చెందాయని ఆరోపించారు. ప్రత్యేక ఆర్థిక మండళ్ల నియమ నిబంధనలను కాలరాస్తూ కంపెనీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. మొత్తం వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ సదస్సులో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గంగపట్నం రమణయ్య మండల సిపిఎం బాధ్యులు నందయ్య, సూరిబాబు, చలపతి, గిరి తదితరులు పాల్గొన్నారు.

**● మంత్రి రామనారాయణరెడ్డి**

# విద్యావ్యాప్తికి వ్యతిరేకి!

విద్యావ్యాప్తికి కృషి చేస్తున్నామని ప్రభుత్వం ప్రకటిస్తుంటే, జిల్లాలో మాత్రం ఆర్థికమంత్రి ఆనం రామనారాయణరెడ్డి విద్యాభివృద్ధిని అడ్డుకొంటున్నాడని ఉదయగిరి శాసన సభ్యుడు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి ఆరోపించారు. ఆర్థికమంత్రి అభివృద్ధి నిరోధకుడిగా మారాడని ఘాటుగా విమర్శించారు. మండల కేంద్రమైన కొండాపురంలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో విద్యారంగం – సంస్కరణలు అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మేకపాటి మంత్రి తీరును తూర్పారబట్టారు. మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లెకు ప్రభుత్వం మోడల్ స్కూలును మంజూరు చేస్తే రామనారాయణరెడ్డి దానిని రద్దు చేయించారని ఆరోపించారు. ఇలాంటి వారు వుంటే విద్యారంగం ఎలా అభివృద్ధి చెందుతుందని ప్రశ్నించారు. ప్రభుత్వం తీసుకొంటున్న విద్యావిధానాల వల్ల విద్యారంగం భ్రష్టుపట్టి పోతున్నదని శాసన మండలి సభ్యుడు వీతపు బాలసుబ్రహ్మణ్యం విమర్శించారు. సర్వశిక్షా అభియాన్ క్రింద ఏటా 14 కోట్ల రూపాయలు ఖర్చుపెడుతున్నా అక్షరాస్యత 84శాతం నుంచి 54శాతానికి పడిపోయిందన్నారు. విద్యలో మనరాష్ట్రం దేశంలో 27వస్థానంలో వుందంటే దానికి కారణం ప్రభుత్వ విధానాలేనని ఆరోపించారు. చట్టసభల్లో విద్యపై చర్చ జరగాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా వుందని వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ కావలి నియోజకవర్గ ఇన్‌చార్జి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ సదస్సులో యుటిఎఫ్ నేతలు శ్రీహరి, చలపతిశర్మ, కోటేశ్వరరావు, భీమేశ్వరరావు, మండల విద్యాశాఖధికారి అబ్దుల్ రజాక్ తదితరులు పాల్గొన్నారు.

**విద్యా సంస్కరణల సభలో మేకపాటి విమర్శ**

# క్రీడలను విస్మరిస్తున్న ప్రభుత్వం!

క్రీడలను ప్రభుత్వాలు విస్మరిస్తున్నందునే మన దేశం క్రీడల్లో వెనుకబడి వుందని కావలి శాసనసభ్యుడు బీద మస్తాన్‌రావు విమర్శించారు. స్థానిక జవహర్ భారతి కళాశాల ఆధ్వర్యంలో జరిగిన ఇంటర్ అంతర్ కళాశాలల పోటీల ప్రారంభ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లాలో 152 ఇంటర్మీడియట్ కళాశాలలు వుండగా కేవలం 80 కళాశాలలు మాత్రమే క్రీడా పోటీలలో పాల్గొనడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. దీన్ని చూస్తే కార్పొరేట్ కళాశాలలకు క్రీడల పట్ల ఎంత చిన్నచూపు వుందో అర్థమవుతుందన్నారు. క్రీడలలో పాల్గొనని కార్పొరేట్, ప్రైవేట్ కళాశాల గుర్తింపు రద్దు చేయాలని ఆ కార్యక్రమానికి విచ్చేసిన కలెక్టర్ శ్రీధర్‌ను సభాముఖంగా కోరారు. క్రీడలను ప్రోత్సహించడంలో భాగంగా తనవంతుగా బిఎంఆర్ చారిటబుల్ ట్రస్టు తరపున లక్షల రూపాయలను ఖర్చు చేస్తున్న సంగతిని గుర్తు చేశారు. కలెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోను ప్రావీణ్యం సాధించాలన్నారు. క్రీడల వలన శారీరక ఆరోగ్యం కల్గుతుందని, తద్వారా మానసిక ఆరోగ్యం వుంటుందన్నారు. మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు ఆటలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. ఇకపై కార్పొరేట్ కళాశాలలు కూడా క్రీడా పోటీల్లో పాల్గొనేలా చర్యలు తీసుకొంటామన్నారు. తల్లిదండ్రులు, కళాశాలల యాజమాన్యాలు ర్యాంకుల కోసం పిల్లల ఆరోగ్యాన్ని పాడు చేస్తున్నారని, ఒత్తిడి పెంచకుండా విద్యార్థుల ఆరోగ్యం పైనా దృష్టి పెట్టాలని అల్లూరు రామకృష్ణ విద్యాసంస్థల కరస్పాండెంట్ అల్లంపాటి విజయ వర్ధన్‌రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో విశ్వోదయ కళాశాల రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డి, ఆర్‌డిఓ సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**కావలి ఎమ్మెల్యే బీద విమర్శ**

# గోల్డ్ కాయిన్స్ పేరిట టోకరా

**నాయుడుపేటలో ఆర్ఎంపి వైద్యుని చేతివాటం**

ప్రజలతో సత్సంబంధాలు పెట్టుకొని, అవసరమైన వారికి వైద్య చికిత్సలు అందిస్తున్న ఆర్ఎంపి వైద్యుడు ఆ ప్రజలకే టోకరా వేసిన వైనం నాయుడుపేటలో చోటు చేసుకొంది. ఇక్కడికి గుంటూరు జిల్లాకు చెందిన చిన్నా అనే ఆర్ఎంపి వైద్యం పేరుతో వచ్చి అందరికి తలలో నాలుకలా వుంటూ మంచిపేరు సంపాదించుకొన్నాడు. అనారోగ్యంతో వుండే వారికి సూదిమందు వేస్తూ, మాత్రలు ఇస్తూ పేరు గడించాడు. గోల్డ్ కాయిన్స్ పేరిట వ్యాపారం చేస్తున్నానని చెప్పి స్థానికులు, చుట్టుప్రక్కల ప్రాంతాల వారి నుంచి గోల్డ్‌కాయిన్స్ పేరుతో నగదు వసూలు చేశాడు. గొట్టిప్రోలు గ్రామానికి చెందిన హరినాధ్ వద్ద 35వేలు, కన్నయ్య వద్ద 15వేలు, చెంచయ్య వద్ద 35వేలు, నాయుడుపేటకు చెందిన రవి అనే వ్యక్తి వద్ద 80వేలు, విజయకుమార్ వద్ద 25వేలు, మణి వద్ద 25 వేల చొప్పున వసూలు చేశాడు. ఈ మొత్తంతో గోల్డ్ కాయిన్స్ కొంటే అధిక లాభాలు వస్తాయని, ఎక్కువ ధరకు అమ్ముకోవచ్చని నమ్మించడంతో లక్షల రూపాయలు ఈ విధంగా వసూలు చేశాడు. అలాగే టిటిడిలో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి పలువురి వద్ద నుంచి పెద్ద మొత్తంలో డబ్బు వసూలు చేసిన ఈ ప్రబుద్ధుడు లక్షల రూపాయలు చేతిలో పడగానే రాత్రికి రాత్రి పరారయ్యాడట. ఇతని చేతిలో మోసపోయామని ఆలస్యంగా గ్రహించిన బాధితులు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించడంతో ఈ మోసగాడి ఉదంతం వెలుగు చూసింది.

## పైకా క్రీడలకు ఐదు లక్షల రూపాయలు

**రాష్ట్ర పరిశీలకుడు కిషోర్ ప్రకటన**

పైకా పోటీలను మండల స్థాయిలో నిర్వహించేందుకు ఐదు లక్షల రూపాయలు కేటాయించినట్లు పైకా క్రీడల రాష్ట్ర పరిశీలకుడు ఎన్‌వి.కిషోర్ తెలిపారు. వెంకటాచలం మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయిలో కబడ్డీ, లాంగ్‌జంప్, హైజంప్ నిర్వహించి క్రీడల పట్ల విద్యార్థుల్లో ఆసక్తి కల్గించడమే ఉద్దేశమన్నారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌డిఓ రాజేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● నష్టాల్లో

# వాకాడు ఆర్టీసి డిపో!

## ప్రజలే బస్సులెక్కి గట్టెక్కించాలన్న ఆర్‌ఎం

వాకాడు ఆర్టిసి డిపో 80 లక్షల రూపాయలు నష్టంలో నడుస్తున్నదని రీజినల్ మేనేజర్ కొమ రయ్య తెలిపారు. ఇటీవల ఆయన వాకాడు డిపోను సందర్శించి వివిధ విభాగాల పని తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్మికుడు కష్టించి పని చేయాలన్నారు. ఈ డిపో నుంచి వివిధ గ్రామాలకు వెళ్తున్న పల్లె వెలుగు బస్సుల వల్ల నష్టాలు వాటిల్లుతున్నా యన్నారు. మల్లాం, మూలపడవ, జరుగు మల్లి ప్రాంతాలకు వెళ్లే బస్సులకు ఆదాయం రావడం లేదన్నారు. బెంగుళూరు, విజయ వాడ, హైదరాబాద్, చెన్నై మార్గాలలో తిరిగే బస్సుల నుంచే ఆదాయం లభిస్తున్న దన్నారు. ఖర్చులు పెరిగిపోవడం, తగినంత రాబడి రాకపోవడంతో ఈ పరిస్థితి తలె త్తిందన్నారు. పలు ప్రాంతాలలో ప్రయాణీ కులు ఆటోలలో ఎక్కేందుకు మొగ్గు చూప డం కూడా ఒక కారణమన్నారు. ఇలాంటి ప్రయాణాలను మానుకోవాలని ఆర్టీసి బస్సు ప్రయాణాలే సురక్షితం అన్నారు.

# మృత్యుకుహరాలు ఆ క్వారీలు!

● పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం

క్వారీ యాజమాన్యాల నిర్లక్ష్యం, అధికారుల అల సత్వం కారణంగా ప్రజలు ప్రాణాలు పొగొట్టు కోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఇష్టానుసారంగా నిర్వహిస్తున్న క్వారీల పేలుళ్ల వలన గూడూరు రూరల్ మండలంలో ప్రజలు మృత్యువాత పడుతున్నారు. ఈ క్వారీల పుణ్యమా అని నిన్నమొన్నటి వరకు ఇళ్లు, పంట పొలాలు నాశనం అవుతుండేది. క్వారీల్లో సంభవించే పేలుళ్ల వల్ల ఇళ్లు బీటలు వారడం, బండరాళ్లుపడి పంట నష్టం జరుగు తుండేది. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో అవి ఇప్పుడు నిండు ప్రాణాలు బలిగొంటున్నాయి. ఇటీవల కాండ్ర గ్రామంలోని ఎస్‌సి పియల్ క్వారీలో జరిగిన పేలుడే ఇందుకు నిదర్శనం. సరైన భద్రతా చర్యలు పాటించకుండా పేలుడు నిర్వహించడం వల్ల ఈ క్వారీలో పని చేస్తున్న బీహార్‌కు చెందిన కూలీలు, విజయవాడకు చెందిన వారు, సమీప గ్రామాల ప్రజలు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని నెల్లూరుకు తరలించారు. విశ్వసనీయ సమాచారం మేరకు పేలుళ్ల వలన ఇద్దరు వ్యక్తులు చనిపోగా చికిత్స కోసం నెల్లూరు వెళ్తున్న వారితో ఈ రెండు మృత దేహాలను వాహనంలో పంపి మార్గ మధ్యంలో వారిని వేరే వాహనంలోకి మార్చి వారి స్వస్థ లాలకు గుట్టుచప్పుడు కాకుండా పంపినట్లు తెలు స్తోంది. మరణించిన ఇరువురు ఇతర రాష్ట్రానికి చెందిన వారు కావడంతో ఈ వ్యవహారం బయటకు పొక్కకుండా క్వారీ యజమాన్యం వ్యవహరించినట్లు గగ్గోలు రేగుతోంది. దీనిపై పోలీసులు విచారణ జరిపితే నిజానిజాలు వెల్లడవు తాయి.

# భూ పరిహారం స్వాహా!

## కాగితాలపూరులో తేలిన నిజం

భూ పరిహారంలో బినామీలు ప్రవేశించి అర్హులకు అందాల్సిన పరిహారాన్ని స్వాహా చేసేస్తున్నారు. జిల్లాలో ఇటీవల పలు ప్రాం తాలలో భూ పరిహారం ప్రక్రదారి పట్టినట్లు వెల్ల డవుతున్నాయి. అలాంటిదే మనుబోలు మండలం కాగితాలపూరు వద్ద నిర్మించిన పవర్‌గ్రిడ్ వ్యవ హారం. దీనికి సంబంధించి అందజేసిన పరిహా రంలో అసలైన వారికి కాకుండా బినామీలకు పరి హారం తాలూకు మొత్తం అందినట్లు సమాచారం. దాదాపు కోటి రూపాయల మేర అవినీతి జరిగినట్లు తెలుస్తోంది. బండేపల్లి సర్వే నెంబర్ 421లో 255.75 ఎకరాలు విస్తీర్ణం వుంది. 1975లో ఈ భూమిని సీలింగ్ ద్వారా ప్రభుత్వం తీసుకొంది. ఇందులో 110.88 ఎకరాల మిగులు భూములు న్నాయి. పాత సీలింగ్‌లో 575 నుండి 590 వరకు గల 71.70 ఎకరాల భూమిని పవర్ గ్రిడ్ తీసు కొంది. అలాగే కొత్త సీలింగ్‌లో 584 నుంచి 590 వరకు గల సర్వే నెంబర్‌లో 62.43 ఎకరాలను గ్రిడ్ తీసుకొన్నది. ఇందులో 61మంది లబ్దిదారులకు ఒక్కొక్కరికి 0.82 సెంట్ల వంతున 47.57 ఎకరా లకు పరిహారం అందించారు. మిగతా 14.87 ఎక రాలకు పరిహారం ఇచ్చినట్లు చెప్తున్నప్పటికీ లబ్దిదా రులకు ఇంతవరకు ఆ మొత్తం అందలేదు. దాదాపు 96లక్షల రూపాయలు దుర్వినియోగం అయినట్లు తెలుస్తోంది. పరిహారం దుర్వినియోగం కావడం, ప్రక్క దారి పట్టడంపై మండలంలో దూమారం రేగింది. టిడిపి మండల నేత పల్లంరెడ్డి రాజశేఖర్‌రెడ్డి దానిపై పూర్తి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

# ఇందిరమ్మ ఇళ్లలో కష్టాల కాపురం!

ఇందిరమ్మ ఇళ్లను నిర్మించినప్పటికీ అందులో మౌలిక వసతుల కల్పన గురించి పట్టించుకోకపోవడంతో వెంకటగిరి పట్ట ణంలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు. ఇప్పటికి మూడు విడతలుగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరిగినప్పటికీ రెండు విడత లుగా జరిగిన వాటిలోనే ఇళ్లు లభించాయి తప్ప మూడవ విడతలో ఇంతవరకు స్థలం చూపలేదు. ఇప్పటివరకు ఇళ్లు నిర్మించిన కాలనీలలో రోడ్లు, మంచినీటి సౌకర్యం, డ్రైనేజి వంటి మౌలిక వసతులు కరువయ్యాయి. రెండవ విడత క్రింద 435 మందికి పక్కాగృహాలు మంజూరయ్యాయి. వీరికి ఇచ్చిన స్థలం అంతా ఎగుడు దిగుడుగా, గుంటల మిట్టలుగా వుం డడంతో ఇళ్లు నిర్మించుకోవడానికి లబ్దిదారులు అధి కంగా ఖర్చు పెట్టాల్సి వచ్చింది. అయినప్పటికి అధి కారులు మౌలిక వసతులు కల్పించాలన్న దానిపై శ్రద్ధపెట్టకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతు న్నారు. ఇక మూడో విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం అబందరగా మారింది. మూడో విడతలో ఎంపికైన లబ్దిదారులకు ఇంతవరకు స్థలాలు చూపించకపోవ డంతో ఇళ్లు నిర్మించుకోవాలన్న వారి ఆశలు తీరడం లేదు. బాడుగ ఇళ్లలో వుంటూ భారం మోయలేక పోతున్నామని త్వరగా స్థలాలు చూపించినట్లయితే ఇళ్లు నిర్మించుకొంటామని ఎదురు చూస్తున్నారు లబ్ది దారులు. తక్షణం స్థలాలు చూపించాలని, కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, విద్యుత్ సౌక ర్యం కల్పించాలని కోరుతున్నారు లబ్దిదారులు.

### వెంకటగిరిలో లబ్దిదారుల ఇబ్బందులు

# మరుగుదొడ్లు కట్టారు - నీటి సౌకర్యం మరిచారు!

అధికారుల నిర్లక్ష్యం కారణంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు నిరుప యోగంగా మారుతున్నాయి. పాఠశాలల విద్యార్థుల సౌకర్యాన్ని దృష్టిలో వుంచుకొని ఆయా పాఠశా లల్లో మరుగుదొడ్లను నిర్మించారు. చాలా చోట్ల నీటి సౌకర్యం లేనందువల్ల లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన మరుగుదొడ్లు నిరుపయోగంగా మారుతున్నాయి. వెంకటగిరి నియోజకవర్గంలో ఇదే పరిస్థితి నెలకొని వుంది. పలు పాఠశాలల్లో వీటిని నిర్మించినప్పటికి నీటి వసతి లేనందువల్ల ఎవరికి ఉపయోగపడడం లేదు. మరుగుదొడ్లను నిర్మించిన అధికారులు వాటికి నీటి సౌకర్యం కల్పించే విష యం పట్టించుకోకపోవడంతో ప్రభుత్వ ఉద్దేశం నెర వేరకుండా పోతోంది. వెంకటగిరి పట్టణంలో గల పాఠశాలలో నిర్మించిన మరుగుదొడ్లు వినియోగం లోకి రాక ముళ్లపొదలు, చెట్లతో నిండి విద్యార్థులు అక్కడకు పోవాలంటేనే భయపడే పరిస్థితులు నెల కొన్నాయి. వీటితోపాటు వంట కోసం నిర్మించిన గదులు వినియోగించకపోవడంతో అవి కూడా నిరుపయోగంగా మారుతున్నాయి. దీనంతటికి కారణం నీటి సౌకర్యం లేకపోవడమే. విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొనైనా అధికారులు స్పందించి మరుగుదొడ్లకు నీటి వసతి కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

### వెంకటగిరి స్కూళ్లలో ఇదీ పరిస్థితి

# వింజమూరులో విషజ్వరాలు!

వింజమూరు మండలం విషజ్వరాల బారిన పడింది. మండలంలోని పలు గ్రామాల ప్రజలు విషజ్వరాల బారినపడి మంచం పట్టారు. తాగునీరు కలుషితం కావడం, పారిశుధ్యం క్షీణించడంతో గ్రామాల్లో అస్తవ్యస్త పరిస్థితులు నెలకొన్నాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో కలుషిత నీటినే త్రాగాల్సి రావడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. మరోవైపు చెత్త పేరుకపోతుండడంతో దోమలు పెరిగి విషజ్వరాలు వ్యాపి స్తున్నాయి. అధిక సంఖ్యాకులు టైఫాయిడ్, మలేరియా, వైరల్ జ్వరాల బారినపడుతుండడంతో ఆస్పత్రికి వచ్చే వారు పెరిగి పోతున్నారు. మండలంలో విషజ్వరాలు ప్రబలడంతో సమాచార మందుకొన్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాసిలా మణి సందర్శించారు. వింజమూరు, నందిగుంట తదితర గ్రామాల్లో పర్యటించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. కలు షిత నీటిని, పేరుకపోయిన చెత్త, పొంగి పారుతున్న మురుగు నీటిని చూసిన ఆయన ఇట్టుంటే రోగాలు రాక ఏం చేస్తాయి అంటూ సిబ్బందిపై మండిపడ్డారు. పరిస్థితి మెరుగుపరచాలని, అందరికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి తగిన వైద్య సహాయం అందించాలన్నారు. జ్వరాలతో బాధపడుతున్న వారిని పరామర్శించారు. గ్రామస్తులతో మాట్లాడుతూ పారిశుధ్య పరిస్థితులను మెరుగుపరచుకోవాలని సూచించారు. సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ నేను వెళ్లగానే ఇంటికి పోకుండా తగిన వైద్యం అందించి డాక్టర్లుగా వ్యవహరించాలన్నారు.

### వైద్య ఆరోగ్యశాఖ స్పందించదేమి?

# భూముల ఆక్రమణ

ప్రభుత్వం కేటాయించిన సిజె ఎఫ్‌ఎస్ భూములను కొం దరు భూస్వాములు ఆక్రమించుకొన్నారని మనుబోలు మండలం జట్ల కొండూరుకు చెందిన ముస్లింలు వెంకటాచలం మం డలం తహశీల్దార్ నారాయణమ్మకు ఫిర్యాదు చేశారు. 1988లో సర్వే నెంబర్ 28,29,30, 32లో 33 మందికి 28 ఎకరాల సిజెఎఫ్‌ఎస్ భూములను పం పిణీ చేసి పట్టాలు అందించారన్నారు. ఈ భూములను బండేపల్లి, కొమ్మలపూడికి చెందిన కొందరు భూములను ఆక్రమిం చారని, దీనిపై ప్రశ్నిస్తే దౌర్జన్యం చేస్తున్నా రని ఫిర్యాదు చేశారు.

జమీన్‌రైతు
పాగతోట, నెల్లూరు - 524 001.
ప్రకటనలకు
98489 66163
98489 66165
చందాలకు
98489 66190

# ఆనంవారి భూ దాహానికి మూడు మునిసిపల్ రిజర్వు స్థలాలు స్వాహా!



నెల్లూరు నగరంలో ఆనం కుటుంబ అరాచక పోకడకు పొలిమేర అన్నది లేకుండా పోతున్నది. ఎందరు ఎన్ని రకాలుగా గీ పెట్టి అరుస్తున్నా, జనం ఛీ కొడుతున్నా ఇంతకంటే మించిన సమయం వేరొకటి దొరకదనే ఆతృతతో అందినంత దోచుకొని తింటున్నారు. నెల్లూరు నగరం పాలిట రాబందుల వలె మారిపోయారు అన్నదమ్ములిద్దరూ. అందుకు తాజా ఉదాహరణ – బాలాజీనగర్ ప్రాంతంలో దాదాపు పాతిక కోట్ల రూపాయలు విలువ చేసే మునిసిపల్ భూమిని స్వాహా చేయడం.

పద్దెనిమిదేళ్ల క్రితం విజయమహల్ గేటు వద్ద బాక్స్ టైప్ అండర్ బ్రిడ్జి కట్టిన సమయంలో దానికి తూర్పువైపు 250 అంకణాల ప్రైవేటు స్థలం తీసుకొన్నది మునిసిపాలిటీ. అయితే అది నివాస స్థలం కాదు. అంతకు పదిహేనేళ్లక్రితం, 1965 ప్రాంతంలో, ఆ ప్రాంతంలోని పొలాలను రియల్ ఎస్టేట్ స్థలాలుగా మార్చి, బాక్స్ టైప్ బ్రిడ్జిలో కలిసిన స్థలాన్ని రోడ్డు క్రింద వదలిపెట్టి వుండినారట. దాన్ని మునిసిపాలిటీకి రిజిష్టర్ కూడా చేశారట. కానీ బ్రిడ్జి కట్టడం మొదలు కాగానే, ఆ రియల్ ఎస్టేట్ యజమానులు తాము లేఅవుట్ రద్దు చేసుకొంటున్నామని, ఈ స్థలం తమకే చెందుతుందని మునిసిపాలిటీకి ఒక జాబు వ్రాసి ఇచ్చారు. అప్పటి నుంచి అది వివాదంగానే నడుస్తున్నది. దీనిపై విచారణ జరిపిన ప్రతి మునిసిపల్ అధికారీ, ఒకసారి రోడ్డు క్రింద మునిసిపాలిటీకి రిజిష్టర్ చేసిన స్థలాన్ని వెనక్కు తీసుకొనే హక్కు లేదని నివేదికలు ఇచ్చారు.

ఇన్నేళ్ల తర్వాత ఈ వివాదాన్ని తమ స్వలాభం కోసం వెలికి తీశాడు ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి. ఆ స్థలం యజమానులతో హైకోర్టులో ఒక కేసు వేయించారు. బ్రిడ్జి కోసం తమ స్థలం తీసుకొన్నారు కాబట్టి తమకు వేరే చోట పరిహారంగా వేరే స్థలం ఇవ్వాలని కోరుతూ వేసిన కేసు అది. అయితే ఆ కేసు విచారణకు రాక ముందే మరొక పిటిషన్ వేసి మధ్యంతర ఉత్తర్వు తెప్పించారు. అందులో హైకోర్టు, పరిహారంగా ప్రత్యామ్నాయ స్థలం కోరుతూ చేసుకొన్న దరఖాస్తును చట్ట ప్రకారం పరిశీలించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. దాన్ని ఆసరాగా తీసుకొని, హైకోర్టు ప్రత్యామ్నాయ స్థలం ఇవ్వమని ఆదేశించిందనే సాకు చూపుతూ, నగరంలోని విలువైన ప్రాంతాలలో ఎకరా 70 సెంట్ల స్థలాన్ని కేటాయిస్తూ జిఓ జారీ చేయించారు ఆనం సోదరులు.

ఒక పథకం ప్రకారం, హైకోర్టును కూడా తప్పు దారి పట్టించి, తప్పుడు తనంతో జరిపిన భూ స్వాహా ఇది. విజయమహల్ బాక్స్ టైప్ బ్రిడ్జి కట్టడంలో ఆ కుటుంబం కోల్పోయిన స్థలం విస్తీర్ణం కేవలం 212 అంకణాలు. కానీ అందుకు పరిహారంగా ఒక ఎకరా 70 సెంట్ల స్థలాన్ని అప్పనంగా అప్పు చెప్పారు. బాలాజీనగర్‌లోని ఇండియన్ గ్యాస్ గోడౌన్ పక్కన ఒక ఎకరా, ఆ ప్రాంతంలోనే వేప దొరువు దగ్గర 40సెంట్లు, చిల్డ్రన్స్ పార్కు మెయిన్ రోడ్డు ఆనుకొని 30 సెంట్లు ఇచ్చారు వీరికి. విచిత్రం ఏమిటంటే ఇవి మూడు కూడా మునిసిపల్ రిజర్వు స్థలాలు. ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించిన మునిసిపల్ రిజర్వు స్థలాలను ప్రైవేటు వ్యక్తులకు కేటాయించకూడదని స్పష్టమైన ప్రభుత్వ ఉత్తర్వులున్నాయి. సుప్రీంకోర్టు తీర్పులు కూడా వున్నాయి. కానీ భూదాహంతో తపించిపోతూ, అధికార మదం తలకెక్కిన ఆనం సోదరులకు ఆ నియమాలు ఏవీ పట్టలేదు. తమ పలుకుబడి ఉపయోగించి ప్రభుత్వం చేత ఆ తప్పు చేయించారు. అందుకోసం మునిసిపల్ కమిషనర్ చేత తప్పుడు పత్రాలపై సంతకాలు చేయించారు. మునిసిపల్ కౌన్సిల్ రద్దయిన ఆరు నెలల తర్వాత కౌన్సిల్ తీర్మానం చేసినట్లు రికార్డు సృష్టించారు. పాత కమిషనర్లు, హైదరాబాదు స్థాయి మునిసిపల్ అధికారుల ఇచ్చిన విచారణ నివేదికలు తొక్కిపెట్టారు. పరిహారంగా స్థలం ఇవ్వవలసిన అవసరం లేదని గతంలో వ్రాసిన కాగితాలన్నీ దాచిపెట్టారు. హైకోర్టుతో ఆటలాడుకొని, దొంగ మార్గంలో ఉత్తర్వులు తెచ్చుకొని, ఈ దుర్మార్గానికి పాల్పడ్డారు.

రెండవ కంటికి తెలియకుండా జరిగిపోతుండిన ఈ దగాకోరు వ్యవహారాన్ని వైఎస్ఆర్ కాంగ్రెస్ నాయకుడు ఆనం వెంకటరమణారెడ్డి పసిగట్టి, బయటపెట్టాడు. ఈ భూ కేటాయింపు పరమ దుర్మార్గమని ఆధారాలతో సహా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. సిపిఎం పార్టీ కూడా ఆయనతో జత కలిసి, దీన్ని ఆపాలని కోరింది. కానీ ఆనం వారి అధికారం ముందు ఇటువంటి కుప్పిగంతులు ఏమి చాలుతాయి? కాకి అరుస్తూ వుంటే కరవాడు ఎండుతూ వుంటుందన్న చందంగా వీరిక్కడ ఫిర్యాదులు చేస్తూ వుంటే, మరొకప్రక్క ఆ తప్పుడు జిఓ చేసిన భూ కేటాయింపులను చట్ట ప్రకారం రిజిష్టర్ చేయించివేశాడు ఎమ్మెల్యే వివేకానందరెడ్డి.

నెల్లూరు నగరంలో ఆనం వారి దుష్టపోకడలు ఎంత బరితెగింపుగా నడుస్తున్నాయో అర్థం చేసుకోవడానికి ఇదొక చిన్న ఉదాహరణ మాత్రమే. అర్థం చేసుకోవడం తప్ప ఎవరు చేయగల్గిందీ ఏదీ లేదు.

జమీన్‌రైతు
పాగతోట, నెల్లూరు - 524 001
ఫోన్: 0861 - 2327354
సెల్: 98489 66190
జీవిత చందా రూ.1000లు
సంవత్సర చందా
స్వదేశంలో రూ.200లు
విదేశాలకు రూ.1000లు

## వేల గడపలు తొక్కినందుకైనా

# పదవీకాంత కరుణిస్తుందా?



రాజకీయం మహా గమ్మత్తైనది. కొంతమంది ఆరుగాలాలు శ్రమించినా రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితి కల్పిస్తుంది. మరి కొందరికేమో వడ్డించిన విస్తరి వలె చేతికి అందివస్తుంది. గుమ్మడి కాయంత కాయకష్టంతో పాటు ఆవగింజంత అదృష్టం కూడా కలిసి రావాలనే సామెత రాజకీయానికి కూడా వర్తిస్తుంది. నెల్లూరు జిల్లా రాజకీయాలలో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఈ మొదటి తరగతికి చెందిన రాజకీయవాది. విద్యార్థిగా వున్నప్పటి నుంచే రాజకీయాలలో ఓనమాలు దిద్దాడు. ఎప్పుడు ఎక్కడ ఏ ఉద్యమానికి అవకాశం కన్పించినా మొదటి వరసలో తానే వుంటాడు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు సంబంధాలున్నాయి. క్రింది స్థాయిలో అపారమైన అనుచరగణం వుంది. నెల్లూరు నగరం వరకు చూస్తే, శ్రీధర్‌రెడ్డికి వున్నంత అనుచర బలం మరే నేతకూ లేదు. కొన్ని వందల మంది కుర్రకారును తన అదుపాజ్ఞలలో పెట్టుకోవడంలో శ్రీధర్‌రెడ్డి ప్రజ్ఞ అసాధారణమైనది. కానీ ఏమి లాభం? పాతికేళ్లపై నుంచి రాజకీయాలలో వున్నా, అదే శ్వాసగా అదే ధ్యాసగా పూర్తికాలం అందులోనే తలమునకలౌతున్నా, పదవీ కాంత పరిష్వంగం మాత్రం దక్కలేదు.

ఇన్నాళ్లకు, ఇన్నేళ్లకు వైఎస్ఆర్ కాంగ్రెస్‌లో ఆ అవకాశం తలుపు తడుతున్నది. రాజకీయ వైకుంఠపాళిలో నిచ్చెన ఎక్కే అదృష్టం కళ్ల ముందు కన్పిస్తున్నది. ఎన్నో ఆశాభంగాలను చవి చూసినవాడు కాబట్టి, ఈసారి ఏ చిన్న పొరపాటు కూడా జరగకుండా జాగ్రత్తపడాలన్నది తాపత్రయం. అందుకోసం శరీరం సహకరించకపోయినా, ఆరోగ్యం వెనక్కు లాగుతున్నా లెక్క చేయకుండా 141 రోజులపాటు నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో గడప గడపకు ఎక్కి ప్రతి ఓటరునూ కలిసి, తనను తాను పరిచయం చేసుకొన్నాడు శ్రీధర్‌రెడ్డి. రాష్ట్రంలో ఇటువంటి ప్రయత్నం ఇప్పటి వరకు ఎవరూ చేసి వుండరు. మామూలు పాద యాత్ర అంటేనే కాళ్లకు బొబ్బలెక్కుతాయి. ఇక గడప గడపకు ఎక్కాలంటే, ఒళ్లు హూనమైపోతుంది. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ముప్పాతిక భాగం నగర ప్రాంతం. విడి విడి ఇళ్లు తక్కువ. మిద్దెలు, అపార్టమెంట్లు ఎక్కువ. కొన్ని వేల మెట్లు ఎక్కి దిగితేనే గడప గడప అన్న లక్ష్యం నెరవేరుతుంది. అదెంత కష్టమో వర్ణించలేము. అయినా శ్రమను ఓర్చి అనుకొన్న లక్ష్యం పూర్తి చేశాడు శ్రీధర్‌రెడ్డి. మధ్యలో విరామాలు, అంతరాయాలు ఎన్ని వచ్చినా మొదట అనుకొన్న ప్రకారం 141 రోజులూ యాత్ర చేశాడు.

శ్రీధర్‌రెడ్డి ఈ కార్యక్రమం తలపెట్టినప్పుడే వైఎస్ జగన్ దీని పట్ల ఆసక్తి చూపాడు. అది గమనించి రాష్ట్రంలో చాలామంది వైఎస్ఆర్ కాంగ్రెస్ నేతలు ఇదే తరహా కార్యక్రమాలు మొదలు పెట్టారు. కానీ వారెవ్వరూ దాన్ని కొనవరకు పూర్తి చేయలేదు. ఒక్క శ్రీధర్‌రెడ్డి మాత్రమే పట్టువదలని విక్రమార్కుడి వలె వ్యవహరించాడు. దీని వల్ల నియోజకవర్గం మొత్తం మీద పటిష్టమైన కార్యకర్తల వ్యవస్థ ఏర్పాటు చేసుకోగలిగాడు. అది పార్టీకి ఎంతగానో ఉపకరిస్తుంది.

జగన్ పార్టీ పెట్టక ముందు నుంచే ఆయన వెన్నంటి నడిచిన ఘనత మేకపాటి రాజమోహన్ రెడ్డికి దక్కుతుంది. అప్పట్లో ఎందరు ఎన్ని రకాల వారించినా, భయపెట్టినా లెక్క చేయకుండా జగన్‌కు అండగా నిలబడ్డాడు. జిల్లాస్థాయిలో ఆ పార్టీకి అటువంటి అంకిత భావం కల్గినవాడు శ్రీధర్‌రెడ్డి. ఆ గుర్తింపు ఏ రూపంలో ఉపకరిస్తుందో రేపటి ఎన్నికలలో తెలిసిపోతుంది. ఈ ప్రయత్నంలో అయినా శ్రీధర్‌రెడ్డికి పదవీకాంత కౌగిలి చిక్కుతుందేమో చూద్దాం.

జమీన్‌రైతు
పాగతోట, నెల్లూరు - 524 001.
ప్రకటనలకు
98489 66163
98489 66165
చందాలకు
98489 66190

# శక్తి ఆరాధన ప్రధానంగా జరిగే దసరా!

ఆశ్వయుజ మాసం శుక్లపక్షంలో మొదటి తొమ్మిదిరోజులను దసరా అంటారు. శుద్ధ పాడ్యమి నుంచి దశమి వరకు ఈ దసరా ఉత్సవాలను జరుపుకోవడం ఆనవాయితి. తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలనే దేవీ నవరాత్రులు అని కూడా అంటారు. హిందూ సంస్కృతి సాంప్రదాయాలలో ఎన్నో పండుగలు, వ్రతాలు, పర్వదినాలు వున్నా శక్తి ఆరాధన ప్రధానంగా జరిగే పండుగగా దసరా ప్రసిద్ధినొందింది. దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాలవారు దసరా ఉత్సవాలను ఆనందోత్సాహాలతో జరుపుకొంటారు. దశవిధ పాపాలను హరించే పండుగగా దసరాను చెప్తారు. శరదృతువు ఆరంభంలో వచ్చే పండుగ కాబట్టి శరన్నవరాత్రులని కూడా పిలుస్తారు. దేవీనవరాత్రుల సందర్భంగా మొదటి మూడురోజులు పార్వతిదేవిని, తరువాత వచ్చే మూడు రోజులు లక్ష్మీదేవిని, చివరి మూడు రోజులు సరస్వతిదేవిని పూజిస్తారు. వీటిలో దుర్గాష్టమి, మహార్నవమి, విజయదశమి ముఖ్యమైనవి. నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి ఒక్కోరోజు ఒక్కో అలంకారం చేస్తారు.



నవ రాత్రులలో దుర్గాదేవిని పూజిస్తారు. దుర్గతులను తొలగించేది కనుక దుర్గ అయింది. దుర్గలోని దుర్ అంటే దుఃఖం, దుర్భిక్షం, దుర్వ్యసనం, దారిద్ర్యం మొదలైనవి, గ అంటే నశింపచేసేదని పండితులు చెప్తుంటారు. దుర్గాదేవిని ఆరాధించడం వలన దుష్టశక్తులు, రక్కసుల బాధలు తొలగుతాయి. అందుకనే మొదట మూడురోజులు దుర్గారూపాన్ని ఆరాధించి అరిషడ్వర్గాలను, తర్వాతి మూడురోజులు లక్ష్మీ దేవి రూపాన్ని ఆరాధించి సిరిసంపదలను, చివరి మూడురోజులు సరస్వతిదేవి రూపాన్ని ఆరాధించి జ్ఞానాన్ని పొందుతారు.

నవరాత్రి రోజుల్లో అతి ముఖ్యమైనదిగా మహర్నవమిని చెప్తారు. ఈ నవమి తిథినాడు మంత్ర సిద్ధి కల్గుతుందంటారు. అందుకే సిద్ధదా అని నవమికి పేరు. దేవీ ఉపాసకులు వారు చేసే జప సంఖ్య ఆధారంగా హోమాలు చేస్తారు. మహార్నవమినాడు దేవిని ఆరాధించడం వలన సర్వసిద్ధులు లభించడంతో పాటు అభీష్టం నెరవేరుతుందని అంటారు. మానవ కోటిని పునీతులను చేసేందుకు భగీరథుడు గంగను భువి నుంచి దివికి తెచ్చింది ఈనాడే అని పురాణాలు చెప్తున్నాయి.



షుగర్ వ్యాధిగ్రస్తులకు
సంజీవని జెరిటిన్-డి

జగన్మాత అయిన దుర్గాదేవి మహిషాసురుడనే రాక్షసునితో తొమ్మిదిరోజులు యుద్ధం చేసి అతన్ని వధించి విజయాన్ని పొందిన రోజుగా విజయదశమిని జరుపుకొంటారు. విజయానికి సంకేతంగా చెప్పబడే విజయదశమిరోజునే రాజులు దండయాత్రకు ఈ శుభముహూర్తాన్ని ఎంచుకొనే వారని పురాణాలు చెప్తున్నాయి. పాండవులు అరణ్యవాసం ముగించే సమయంలో అర్జునుడు జమ్మిచెట్టు మీద భద్రపరచిన తమ ఆయుధాలను తీసి విజయదశమిరోజునే గోగ్రహణ యుద్ధం చేసి విజయుడైనట్లు పురాణాల్లో చెప్పబడింది. శ్రీరాముడు సైతం తొమ్మిది రోజులపాటు శక్తి పూజ చేయడం వలనే రావణ సంహారం చేసినట్లు పురాణ కథనం. ఈ పండుగ సందర్భంగా విద్యార్థులు పుస్తకాలను, శ్రామికులు పనిముట్లను, వాహనాలకు పూజ చేసి అమ్మవారి ఆశీస్సులు అందుకొంటారు. అలాగే దసరాల్లో వేడుకగా బొమ్మల కొలువును పెట్టే ఆచారం వుంది.

నాటక ప్రదర్శన

## ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసిన

# జయప్రకాష్‌రెడ్డి అలెగ్జాండర్ నాటకం!

సినీ నటుడిగా బిజీగానే ఉన్నా రంగస్థలంపై మక్కువతో ప్రపంచంలో ఏ నటుడు చేయని కొత్త ప్రయోగం; ఏకబిగిన వంద నిమిషాలపాటు ఒకే నటుడు ప్రదర్శించే 'బాణం' సాంఘిక నాటకం అలెగ్జాండర్ ప్రదర్శనను నెల్లూరులో జయప్రకాష్‌రెడ్డి ప్రతిభావంతంగా పోషించి ప్రేక్షకుల మన్ననలు పొందారు. రాష్ట్రంలో 24వ ప్రదర్శనగా కస్తూరిబా కళాక్షేత్రంలో అలెగ్జాండర్ ప్రదర్శన కొనసాగింది. అలెగ్జాండర్ ఒక మిలట్రీ మేజర్. రిటైర్ అయ్యాక గమ్మున ఇంట్లో కూర్చోక 'హెల్ప్‌లైన్' ప్రారంభిస్తాడు. సమస్యలున్న వారు దానికి ఫోన్ చేస్తే సందర్భోచిత పరిష్కారాలను ఆయన సూచిస్తుంటాడు. అలెగ్జాండర్‌కు వచ్చే ఫోన్లన్నీ ప్రేక్షకులకు బాగా పరిచయమున్న సినిమా నటులు కోట శ్రీనివాసరావు, అల్లరి నరేష్, సుమ, ఝాన్సీ, రఘుబాబు, మాస్టర్ భరత్, కొండవలస, తెలంగాణ శకుంతల, సాయికుమార్, రావికొండలరావు, రాధాకుమారి గొంతులతో కావడం ఈ నాటకం రక్తికట్టడానికి ఒక కారణంగా చెప్పుకోవాలి. హెల్ప్‌లైన్‌లో సమాకాలీన అంశాలైన ర్యాగింగ్, వరకట్నం, రిజర్వేషన్లు, మతం, పత్రికలు, రాజకీయాల గూర్చి చర్చ జరుగుతుంది.

ఈ సందర్భంగా జయప్రకాష్‌రెడ్డి పలికే కొన్ని డైలాగులు ఆలోచింపజేస్తాయి. చదువులో క్రియేషన్... రిక్రియేషన్ ఉన్నాయి. మనిషిని మతం శాసిస్తుంది. తెలుగువాడు తెలుగు వారితో తెలుగులోనే మాట్లాడాలి. మచ్చుకుకొన్నిగా చెప్పుకోవచ్చు. హెల్ప్‌లైన్‌లో వచ్చే ఫోన్లకు అలెగ్జాండర్ ఇచ్చే పరిష్కారాలు అంతిమంగా పని చేసి వారంతా కృతజ్ఞతలు చెప్పే ఫోన్లు సైతం వస్తాయి. మిత్రుని కుమారుడు మిలట్రీలోనే మేజర్‌గా ఉండే సలీమ్ మరణంపై అలెగ్జాండర్‌కు వచ్చే ఉత్తరం చదువుతూ గుండెపోటు వచ్చి చనిపోవడంతో నాటకం సమాప్తమవుతుంది. వృద్ధాప్యంలో బిడ్డల నీడలో బతకాలన్న సందేశం కూడా ఈ నాటకం ఇస్తుంది.



అలెగ్జాండర్ నాటకంలో నటుడు జయప్రకాష్‌రెడ్డి హావభావ విన్యాసాలు.

వంద నిమిషాలపాటు ఏమాత్రం తొట్రుపడకుండా అలెగ్జాండర్ పాత్రను అవలీలగా జయప్రకాష్‌రెడ్డి పోషించి ప్రేక్షకుల అభినందనలు అందుకొన్నాడు. నాటకం అనంతరం జరిగిన అభినందన సభలో ఎస్పీ రమణకుమార్ మాట్లాడుతూ భావితరాలకు మంచి సందేశం అందించాలనే ప్రయత్నంలో పోలీసు కుటుంబం నుంచి వచ్చిన జయప్రకాష్‌రెడ్డి వేస్తున్న అలెగ్జాండర్ నాటక ప్రదర్శన అద్భుతమన్నారు. నక్షత్ర బిల్డర్స్, ఎమ్మెల్యే ఆదాల ప్రభాకర్‌రెడ్డి, జిల్లా అధికార యంత్రాంగం, మురళీకృష్ణ హాజరత్‌బాబు సహకారంతో నెల్లూరులో అలెగ్జాండర్ ప్రదర్శన విజయవంతమయ్యిందని జయప్రకాష్‌రెడ్డి చివరన కృతజ్ఞతలు చెల్లించారు.




గతవారం వలె పనులలో జాప్యం, ఆర్థికపరమైన ఇబ్బందులు, తరచూ దూర ప్రయాణాలు తద్వారా శరీర అలసట, చేసే ఆలోచనలు కలసిరాకపోవుట వుంటుంది. వృత్తి, వ్యాపారాలలోని వారికి కలసిరాని కాలం. ఉద్యోగులకు అధిక పనిభారం. అవసరాలకు డబ్బు చేతికందుతుంది. కొన్ని వార్తలు మిమ్ములను కలవరపాటుకు గురి చేస్తాయి. వ్యవసాయదారులకు సామాన్యం.




పనులలో అడ్డంకులు తప్పకపోవచ్చు. శ్రమపడ్డా ఫలితం శూన్యం. కుటుంబలో ఆస్తి తగాదాలు లేదా వివాదాలు నెలకొంటాయి. బంధు మిత్రులతో బేధాభిప్రాయాలు కలుగుతాయి. నూతన గృహ నిర్మాణాది కార్యక్రమాలకు తగు నిర్ణయాలు తీసుకొంటారు. ఖర్చులు అంచనాలు మించుతాయి. విద్యార్థులు ఉన్నతవిద్యకు సంబంధించి ప్రణాళికలు వేసుకొంటారు.




ఇంటాబయట ప్రోత్సాహకరంగా వుంటుంది. శుభకార్య యత్నాలకు బంధుమిత్రుల సహకారం వుంటుంది. గతవారం కంటే ఈ వారం ఖర్చులధికంగా వుంటాయి. ఎదుటివారితో మాటలు జాగ్రత్తగా కలపండి. అకాల కలహాలకు కారణమవుతాయి. వృత్తి, వ్యాపారాల వారి ఆర్థికస్థితి గతం కంటే మేలనిపిస్తుంది. కళా, క్రీడా రంగాలవారి కీర్తిప్రతిష్టలు పెరుగుతాయి.




తలపెట్టిన పనులలో జాప్యం ఏర్పడి మానసిక అశాంతి వుంటుంది. ఆర్థిక సామాన్యతలున్నా, ఖర్చులూ అధికంగానే వుంటాయి. వృత్తి, వ్యాపారాల వారు శక్తియుక్తులతో పుంజుకుంటారు. విద్యార్థులు స్వల్ప ప్రయత్నంలో చేపట్టిన పనులు పూర్తి చేస్తారు. ఉద్యోగులకు శ్రమకు తగ్గ ఫలితం శూన్యం. వ్యవసాయదారులకు పనులు మందకొడిగా సాగుతాయి. రాజకీయులకు కీర్తిప్రతిష్టలు పెరుగుతాయి.




చేపట్టిన పనులలో అధికభాగం పట్టుదలతో పూర్తి చేస్తారు. శుభ వార్త మిమ్ములను ఆనందపరుస్తుంది. ఇంటాబయట మాటపట్టింపులు, మనస్పర్ధలు వచ్చే అవకాశం వుంది. వృత్తి, వ్యాపార ఆర్థిక లావాదేవీలు సంతృప్తినిస్తాయి. దేవాలయ సందర్శన, ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొనడం చేస్తారు. విద్యార్థులు పుంజుకుంటారు. వ్యవసాయదారులు తమ పనులు పూర్తి చేస్తారు.




నూతన పనులు చేపడతారు. వృత్తి, వ్యాపార, ఉద్యోగాలలోని వారికి ఆర్థిక వ్యవహారాలు ఉత్సాహాన్నిస్తాయి. శత్రువులు మిత్రులుగా మారుతారు. అనుకున్న విధంగా అవసరానికి అధిక మొత్తంలో డబ్బు చేతికందుతుంది. చేపట్టిన పనులలో ఆటంకాలు ఎదురైనా సకాలంలో పూర్తి చేస్తారు. నూతన గృహ నిర్మాణాది పనులకు శ్రీకారం చుడతారు. సమాజంలో మీ కీర్తిప్రతిష్టలు పెరుగుతాయి.

# వారఫలాలు

*తేది 13-10-2012 నుండి 19-10-2012 వరకు వృషభంలో గురు, కేతువులు; సింహంలో శుక్రుడు; 17తేది వరకు కన్యలో రవి తదుపరి తులలో; తులలో బుధ, శనులు; వృశ్చికంలో కుజ, రాహువులు; సింహ, కన్య, తుల, వృశ్చికాలలో చంద్రుడు సంచరిస్తారు.*

## పంచాంగం

13తేది శని త్రయోదశి, మాస శివరాత్రి.
15తేది మహాలయ అమావాస్య, సోమవార వ్రతం.
16తేది దేవీ నవరాత్రులు ప్రారంభం.
తులా సంక్రమణం.
17తేది జిలహేజ్ నెల ప్రారంభం.

### శుభ ముహూర్తాలు

మహాలయ పక్షం కావడంతో వివాహాది శుభకార్యాలకు ముహూర్తాలు లేవు.

### అక్టోబర్ తిథులు


**నిజ భాద్రపద బహుళ**

| | | | | |
|---|---|---|---|---|
| 13 | శని | త్రయోదశి | రా 11.09 | గం.ల.వ |
| 14 | ఆది | చతుర్దశి | రా 08.31 | గం.ల.వ |
| 15 | సోమ | అమావాస్య | సా 05.31 | గం.ల.వ |

**ఆశ్వయుజ శుద్ధ**

| | | | | |
|---|---|---|---|---|
| 16 | మంగళ | పాడ్యమి | మ 02.16 | గం.ల.వ |
| 17 | బుధ | విదియ | ప 10.57 | గం.ల.వ |
| 18 | గురు | తదియ | ఉ 07.42 | గం.ల.వ |
| | | తదుపరి చవితి | తె 04.40 | గం.ల.వ |
| 19 | శుక్ర | పంచమి | రా 01.57 | గం.ల.వ |

**అక్కరాజు బాలసుబ్రహ్మణ్యం**
7/34, దొడ్ల సుబ్బారెడ్డి నగర్, నవలాకులతోట,
నెల్లూరు – 2. సెల్: 95819 76599.




పనులలో ఉత్సాహం చూపుతారు. ఆర్థిక అదనపు ఆదాయాలుంటాయి. వృత్తి, వ్యాపారాలలోని వారు ఉత్సాహంతో ముందుకు పోతారు. ఉద్యోగులకు పై అధికారుల ప్రశంలందుతాయి. కాని ఆరోగ్య విషయంలో జాగ్రత్తలవసరం. విద్యార్థులు తమ చిన్ననాటి మిత్రులను కలుసుకొంటారు. వ్యవసాయదారులకు పనులు అనుకూలిస్తాయి. రాజకీయులకు సభలు, సన్మానాలు ఉత్సాహాన్నిస్తాయి.





గతవారం వలె పనులలో జాప్యం, కుటుంబ సభ్యులతో మాట పట్టింపులు, శరీరారోగ్యలోపాలు, తరచూ ప్రయాణాలచే అలసట బాధిస్తాయి. కొన్ని పనులు వాయిదా వేయడం మంచిది. ఆర్థిక విషయాలలో ముందుచూపు అవసరం. విద్యార్థులు తమ ప్రమేయం లేకుండానే వివాదాలలో చిక్కుకునే ఆస్కారముంది. వ్యవసాయదారులకు అవసరానికి డబ్బు చేతికందినట్లే అంది వెనక్కు పోతుంది.




తలపెట్టిన పనులు వాయిదాపడతాయి. ఆర్థిక లావాదేవీలు మందగిస్తాయి. నిరుత్సాహం కలిగిస్తుంది. వృత్తి, వ్యాపార భాగస్వామ్యంలోని వారికి పనులు సాదాసీదాగా సాగుతాయి. అవసరానికి డబ్బు చేతికందుతుంది. కుటుంబ సమస్యలపై లేదా ఒక ముఖ్య విషయమై పెద్దలను కలుసుకునే అవసరం వుంటుంది. కళా, క్రీడా రంగాలలోని వారు ప్రతి పనిలోనూ విజయం సాధిస్తారు.




తలపెట్టిన పనులలో చిన్న చిన్న ఇబ్బందులెదురైనా సకాలంలో పూర్తి చేస్తారు. కొన్ని వార్తలు మీ ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయి. ఉద్యోగులు చేసే పనులకు పై అధికారుల విశ్వాసం, ప్రశంసలు లభిస్తాయి. కుటుంబంలో తలపెట్టిన శుభకార్యాలు ఉత్సాహంగా సాగుతాయి. విద్యార్థులు తమ లక్ష్యాలను సాధిస్తారు. కళా, క్రీడా రంగాల వారు తలపెట్టిన పనులు కష్టపడి పూర్తి చేస్తారు.




తలపెట్టిన పనులలో పరిస్థితులకు తగ్గట్లు మిమ్ములను మీరు మార్చుకోవాలి. కొన్ని సందర్భాలలో పట్టువిడుపులు చాలా అవసరం. మానసిక అలసట, నిద్రలేమి బాధిస్తాయి. మనోధైర్యం అవసరం. వృత్తి, వ్యాపారాల వారికి సామాన్య ఆదాయాలు. కళా, క్రీడా రంగాల లోనివారికి వృత్తిపరమైన వ్యవహారాలు అనుకూలిస్తాయి. రాజకీయులకు పై, క్రింది వర్గాలతో సమస్యలు, ప్రయాణాలుంటాయి.




పనులన్నీ సకాలంలో పూర్తి కావడంతో ఉత్సాహంగా విందులు, వినోదాలలో పాల్గొంటారు. అవసరానికి డబ్బు చేతికందుతుంది. చేసే ప్రతి పనిలో గుర్తింపు పొందుతారు. విద్యార్థులకు నిరాశ కలిగిస్తుంది. వ్యవసాయదారులకు పనులు సామాన్యంగా వుంటాయి. ఉద్యోగాలలోనివారికి అకస్మాత్తుగా స్థానమార్పులు తప్పకపోవచ్చు. రాజకీయులకు పై వర్గాల నుంచి కీలక సమాచారంతో నిరుత్సాహం.

# గృహమునకు 'చతుష్పధారింత' వేధ మహాబాధ!

*డాక్టర్ పరబ్రహ్మం సికింద్రాబాద్*

** నాలుగు వీధులు గృహానికి రాకూడదా? దోష పరిహారం చెప్పండి?*

'విశ్వకర్మ ప్రకాశిక' వాస్తుశాస్త్రంలో నాలుగు వీధుల వేధ ఎంత తీవ్రతను కలిగి ఉంటుందో వివరించబడింది. నిష్ణాతులైన శాస్త్రజ్ఞులు వేధో నివారణకు యంత్ర నిర్ణయం చేస్తారు.

*పి.సుజాత నెల్లూరు*

** రెండో అమ్మాయి జాతకరీత్యా నష్ట జాతకురాలు. మా వారు చనిపోయారు.*

ఒకరి జనన, మరణాలకు మరొకరు ఎప్పటికీ కారణం కారు. రెండో అమ్మాయిని ప్రేమగా చూసుకోండి. లేకపోతే ఒత్తిడికి గురై ఆమె కూడా మీకు దూరం అవుతుంది.

*ఇ.జానకిరాం బెంగుళూరు*

** 'అష్టమి' అని ఉంటే మంచి ఉద్యోగావకాశాన్ని పోగొట్టుకున్నాను.*

కాలండర్ మనుషుల జీవితాలిలాగే ఉంటాయి. అష్టమి ఆ రోజంతా ఉండదు కదా? అవకాశమున్నప్పుడు మీరు ఇంటర్వ్యూకి వెళ్లి ఉండాల్సింది.

*కె.త్రివేణి కావలి*

** శిశు జనన నక్షత్ర పాద దోషాల్ని పాటించవచ్చునా?*

అవసరం లేదు. శిశువు ద్వేషం పెంచుకోవడానికి ఉపయోగపడే ఏ అంశాన్నయినా పాటించనవసరం లేదు.

*డి.విజయ నెల్లూరు*

** ప్రతి పనికీ ఆయన కేలండర్ చూస్తారు?*

ప్రతి కేలండరు సరైనదని చెప్పలేం కదా? శాస్త్రజ్ఞుల సలహా తీసుకోండి. కేలండరు మనుషుల వల్లే సమాజంలో ఛాందసాలు పెరిగిపోయాయి.

*డి.విశ్వనాధశాస్త్రి విజయవాడ*

** వాస్తుశాస్త్ర ప్రాచీన గ్రంథాలలో కులాల వారీగా స్థలాలు నిర్ణయించడం న్యాయమేనా?*

అప్పటి, ఇప్పటి పరిస్థితులు వేరు వేరు. శాస్త్రాలు సూచించిన నిబద్ధతను శాస్త్రజ్ఞులు పాటించి అలా రాశారు. ఆధునిక కాలంలో కొన్ని పద్ధతులు సాధ్యం కాకపోవచ్చు. అందుకు నేనూ అంగీకరిస్తాను.

*డాక్టర్ ఉషాకిరణ్ సికింద్రాబాద్*

** 'ఉత్తరం' నిద్రను గురించి శాస్త్రీయతను చెప్పండి?*

విద్యుదయస్కాంత క్షేత్రాలవైపు తల ఉంచి నిద్రించడం వల్ల కలత నిద్ర, నిద్రలేమి, పీడకలలు వంటి స్థితులు ఏర్పడుతాయి. అందువల్ల ఉత్తరం నిద్రను శాస్త్రజ్ఞులు అంగీకరించ లేదు.

## వాస్తు సందేహాలు సమాధానాలు

**ఆచార్య సుబ్రహ్మణ్య మహర్షి**
4వ వీధి, గాయత్రినగర్, ఎ.కె. నగర్ పోస్టు, నెల్లూరు-4.
ఫోన్: 2322345, సెల్: 9490125878.

*ఎం.ఉమాదేవి కర్నూలు*

** గృహ వాస్తును వెంటనే సరిచేయలేని స్థితిలో ఉపాయం ఏమిటి?*

స్థలం దిక్కు లోపాలు, గృహస్థు జన్మ నక్షత్రం వీటిని గణించి వచ్చే నిర్ణీత యంత్ర ప్రతిష్ట అత్యుత్తమం.

*వి.సంతోష్‌రెడ్డి మహబూబ్‌నగర్*

** రోగం మీద రోగం. ఆమె బాధ చూడ లేకపోతున్నాను.*

తాంత్రిక, మాంత్రికుల్ని నమ్ముకోవడం మీ అజ్ఞానం. వెంటనే మహిళా డాక్టర్ని సంప్రదించండి. ఉత్తరం వాయువ్య ద్వారాన్ని ఈశాన్యంలో అమర్చండి.

*సి.భారతీరెడ్డి చిత్తూరు*

** అపార్టుమెంటులో లోపలా బయటా వాస్తులోపాలున్నాయి.*

లోపల దోషాల్ని సరిచేసుకోవచ్చు. బాహ్య దోష ప్రభావం అంటకుండా యంత్ర ప్రతిష్ట సరిపోతుంది.

*డాక్టర్ ఎం.ఎన్.ఆర్ బెంగుళూరు*

** అమ్మాయి వచ్చినప్పటి నుంచి మా ఆర్థిక పరిస్థితి దిగజారిపోయింది.*

ఉన్నత విద్యావంతులై ఇంత 'కుసంస్కారం'గా కోడలిపై అభియోగాలు మోపడం బాధాకరం. ఆమెదిప్పుడు శుక్రమహర్దశ. ఆమె వల్లే నాలుగు మెతుకులు తినగలుగుతున్నారు.

### కలిగిరి సొసైటీలో...

# రుణమాఫీ పథకంలో రూ.35లక్షలు స్వాహా!

**కలిగిరి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం పరిధిలో రుణ విమోచన పథకం క్రింద కోటి 23 లక్షల 40వేల 159 రూపాయలు క్లెయిమ్ చేయాల్సి ఉండగా అదనంగా మరో 28 లక్షల రూపాయలు క్లెయిమ్ చేసి స్వాహా చేసినట్లు తేలినా దీనికి కారకులైన వారిపై చర్యలకు ముందు వెనుక ఆలోచిస్తున్నట్లు తెలిసింది.**

రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ పథకం అధికారులే ఎక్కువగా దుర్వినియోగం చేసి నిధులు స్వాహా చేశారు. 2008వ సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వ్యవసాయసాగు నిమిత్తం బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను పూర్తిగా మాఫీ చేసిన సంగతి తెలిసిందే. ఈ రుణ మాఫీ పథకాన్ని కొందరు బ్యాంకు సిబ్బందితోపాటు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల సిబ్బంది బాగా ఉపయోగించుకున్నారు. అప్పటికే బినామీ రైతుల పేరిట వ్యవసాయ రుణాలు పొందిన సిబ్బంది రుణమాఫీ పథకం అమల్లోకి రావడంతో చెల్లించ కుండా మానేశారు. ఈ విషయం జిల్లా అధికారులకు తెలిసినా కూడా ఎటువంటి చర్యలు తీసుకోలేక పోయారన్న ఆరోపణలు వున్నాయి.

తాజాగా కలిగిరి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో దాదాపు 35లక్షల రూపాయలు దుర్వినియోగం జరిగినట్లు అధికారులు జరిపిన విచారణలో నిర్ధారణ జరిగింది. నిధుల దుర్వినియోగంపై కావలి డివిజనల్ సహకారశాఖ కార్యాలయంలో పని చేస్తున్న అసిస్టెంటు రిజిస్ట్రార్ విచారణ జరిపి ప్రాథమిక నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించడం జరిగింది. ఈ నివేదిక సమర్పించి ఏడాది గడుస్తున్నా నిధులు స్వాహాచేసిన వారిపై ఇప్పటివరకు ఎటు వంటి చర్యలు తీసుకోబడలేదు.

కలిగిరి ప్రాథమిక వ్యవసాయ పరపతి సం ఘం పరిధిలో 14 రెవెన్యూ గ్రామాలు వున్నాయి. రుణ విమోచన పథకంలో కోటి 23 లక్షల 40వేల 159 రూపాయలను వాస్తవంగా క్లెయిమ్ చేయాల్సి వుం డగా అదనంగా 28 లక్షలకు పైగా క్లెయిమ్ చేయ డం జరిగింది. ఇందులో సిబ్బంది చేతివాటం ప్రదర్శిం చినట్లు తెలుస్తుంది. అర్హతలేని వారిని సైతం అర్హు లుగా నమోదు చేయడం, రైతుల నుంచి అధికంగా వడ్డీ వసూలు చేయడం అర్హత గల రైతులకు ఇన్సెం టీవ్‌గా 5వేల రూపాయలను వారి ఖాతాల్లో జమ చేయాల్సి వుంటుంది. పిఎసిఎస్ ముఖ్య కార్యనిర్వ హణాధికారి 2007 ఏప్రిల్ నుంచి డిసెంబర్ 2007 వరకు వసూలు చేసిన మొత్తాలను సదరు లెడ్జెర్లలో పోస్టింగ్ వేయక నిర్లక్ష్యంగా వ్యవహరించారు.

బ్రాంచి సూపర్‌వైజర్ వందశాతం క్లెయిమ్‌లు తనిఖీ చేయాల్సి వున్నా ముఖ్యకార్య నిర్వహణాధికారి 1999 సంవత్సరంలో క్రాకటూరు, తెల్లపాడు సం ఘాల్లో తనిఖీలు చేయలేదన్న విషయాన్ని తెలుసుకొని నిర్లక్ష్యంగా వ్యవహరించి 27లక్షల 99వేల రూపా యలు క్లెయిమ్ చేసేందుకు సిఫార్సు చేసినట్లు విచా రణలో తేల్చారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు, నాబార్డు గైడ్‌లైన్స్ ప్రకారం ఆడిట్ పూర్తి చేసిన పిదప మాత్రమే ఆప్కాబ్‌కు సిఫార్సు చేయాల్సి వుం టుంది. అయితే ఇక్కడ ఆడిట్ జరగకపోయినా క్లెయిమ్ చేసి కలిగిరి పిఎసిఎస్‌కు సర్దుబాటు చేసేం దుకు ఎన్‌డిసిసిబి సిఇఒను బాధ్యుడిగా గుర్తించి నివే దికలో పేర్కొనడం జరిగింది. రైతులకు ప్రోత్సహంగా అందించే 5వేలను కూడా 11మంది రైతులకు రెండు దఫాలు చెల్లించినట్లు, అర్హతలేని మరో 5గురికి 25 వేలు చెల్లించినట్లు గుర్తించారు.

అలాగే మరో ముగ్గురికి 2,750 రూపాయలు అధికంగా చెల్లింపు జరిపినట్లు విచారణలో తేలింది. కలిగిరి పిఎసిఎస్ ముఖ్యకార్య నిర్వహణాధికారిగా పని చేసిన పి.కృష్ణారెడ్డి పదవి విరమణ చేసిన మేనే జర్ కె.రామయ్యల నుంచి 4లక్షల 10వేలు, ఇక్కడ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన ఆర్. మార్కొండారెడ్డి నుంచి 2లక్షల 35వేల రూపాయలను వసూలు చేయడంతోపాటు వారిపై తగినచర్యలు తీసుకోవాలని నివేదికలో పేర్కొన్నారు. రుణ విమోచన పథకం 2008 క్రింద తప్పుడు సమా చారం అందించి క్లెయిమ్ చేసినందుకు సంఘం బైలా ప్రకారం క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని నివే దికలో కోరారు. అధికారపార్టీ నేతల సహకా రంతో విచారణ నివేదికను తొక్కిపెట్టినట్లు తెలిసింది. ఉన్న తాధికారులు స్పందించి సొసైటిలో నిధుల స్వాహా చేసిన వారిపై చర్యలు తీసుకోవాల్సి వుంది.

పనికి డుమ్మా

● పనిచేయరు... విధులకు హాజరుకారు

# నెల్లూరులో యూనియన్ నేతల హల్‌చల్!

**ఎన్జీఓ, రెవిన్యూ సర్వీసుల నేతలతోపాటు ఉపాధ్యాయ సంఘాలైన యుటిఎఫ్, ఎపిటిఎఫ్ నేతలు విధులకు హాజరుకారు. సంఘు సభ్యుల సమస్యలు పరిష్కరించరు. కానీ వీరు నేతలుగా కొనసాగడం విచిత్రమనిపిస్తుంది.**

జిల్లాలో కొందరు అధికారులు యూనియన్ల పేర్లతో విధులకు డుమ్మా కొడుతున్నారు. వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన ఉద్యోగుల పేరుతో యూనియన్లు స్థాపించి ఉన్నతాధికారులను సైతం భయపెడుతున్నారు. యూనియన్ నేతలుగా చెలామణి అవుతున్న వారు వారు పనిచేసే కార్యాల యానికి చుట్టపుచూపుగా ఏదో ఒక సమయంలో వచ్చి హాజరు పట్టీలో సంతకం చేసి వెళుతుంటారు. వారిని ప్రశ్నించేందుకు ఏ అధికారి కూడా సాహసం చేయలేని పరిస్థితి. అధికారులకు సంబంధించిన పైవేటు వ్యవహారాలు చక్కబెట్టడం, యూనియన్ కార్య క్రమాల్లో బిజీగా ఉంటూ తరచూ అధికారులను కల వడం, సస్పెండ్‌కు గురికాబడిన వారికి తిరిగి పోస్టింగ్ ఇప్పించడం వంటి పనుల్లో నిత్యం బిజీగా ఉంటున్నారు.

జిల్లాలో ప్రధానంగా నాన్‌గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్, రెవిన్యూ సర్వీసెస్ అసోసియేషన్, విద్యాశాఖకు సంబంధించి ఎపిటిఎఫ్, యుటిఎఫ్ శాఖలు బలంగా ఉన్నాయి. రెవిన్యూ సర్వీసెస్‌లో జిల్లా కలెక్టరేట్ నుంచి మండల తహశీల్దార్ కార్యాల యంలో పనిచేసేవారు నాయకులు వరకు ఉన్నారు. ఈ అసోసియేషన్ రెవిన్యూ ఉద్యోగుల సంక్షేమం కోసం, వివిధ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాల్సి ఉంటుంది. అయితే సమస్యలు, సంక్షే మాన్ని ఎప్పుడో ప్రక్కనపెట్టి కేవలం పైరవీలకే అధిక ప్రాధాన్యతనిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. రెవిన్యూ శాఖలో ఏళ్ల తరబడి పదోన్నతులకు నోచు కోని సిబ్బంది అనేక మంది ఉన్నారు.

ఇటువంటి వారి గురించి అధికారులతో సంప్ర దింపులు జరపడం లేదు. కేవలం యూనియన్‌లో కీలక పదవుల్లో ఉన్న వారికి పదోన్నతులు కల్పించే దుకు, ఇతర మండలాలకు బదలీలు జరగకుండా పట్టణ ప్రాంతాలకే పరిమితం చేసేందుకు కృషి చేస్తుం టారు. యూనియన్ పదవుల్లో కొనసాగుతూ నిత్యం కలక్టరేట్ ఆవరణలో దర్శనమిస్తుంటారు. గతంలో నగర శివారు ప్రాంతంలో రెవిన్యూ సర్వీసెస్ అసోసి యేషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయిం చింది. వీటి కొనుగోలుకు సభ్యుల నుంచి వసూలు చేసిన నగదుకు లెక్కలు చూపడం లేదని అప్పట్లో కొందరు సభ్యులు ఆందోళన చేపట్టి ఉన్నతాధికారు లకు ఫిర్యాదులు చేశారు. ఎన్నో సంవత్సరాల నుంచి అసోసియేషన్‌లో చక్రం తిప్పుతున్న వారు మరొకరికి అవకాశం కల్పించకుండా అడ్డుకుంటున్నారు.

కార్యదర్శిగా ఎన్నికైనట్లు ప్రకటించుకున్న చొప్పా రవీంద్రబాబును రాష్ట్ర కమిటీ అసోసియేషన్ నుంచి తొలగించినట్లు ఇటీవల ప్రకటించింది. కొందరు సభ్యులను తనకు అనుకూలంగా మలచుకొని ఏకగ్రీ వంగా ఎన్నుకున్నట్లు పత్రికా ప్రకటన కూడా విడు దల చేయడం జరిగింది. ఈ ఏకగ్రీవ ఎన్నిక చెల్లు బాటు కాదని రాష్ట్ర కమిటీ ప్రకటించడంతో అసోసి యేషన్‌లో కలకలం రేగింది.

ఇదిలా ఉండగా ఎన్జీఓ అసోసియేషన్ పరిస్థితి మరోలా ఉంది. ఇందులో కూడా కీలకపాత్ర పోషించే నేతలు వారికి కేటాయించిన విధుల్లో ఎప్పుడూ కని పించరు. అధికార పార్టీ నేతల నివాసాల వద్దగానీ, కలెక్టర్, డిఆర్వో, జాయింట్ కలెక్టర్ కార్యాలయాలు, నివాసాల వద్ద దర్శనమిస్తూ వారికి అవసరమైన వ్యక్తుల పనులు చేయిస్తుంటారు. ఎన్జీఓ అసోసియేష న్‌లో అధ్యక్షులు, కార్యదర్శులుగా ఉన్న వారు సంవ త్సరాల తరబడి ఒకే కార్యాలయంలో అతుక్కుపోయి ఉన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మూడు సంవ త్సరాల సర్వీసు ఒకే ప్రాంతంలో పూర్తిచేసిన వారిని మరో చోటుకు బదలీ చేయాల్సి ఉంటుంది. ఎన్జీఓ నేతలు ఇందులో కొంత మినహాయింపు ఇచ్చినట్లు న్నారు. ఉన్నతాధికారులు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరక్టర్ కార్యాలయంలో గుమస్తాగా పనిచేస్తున్న వ్యక్తి ఎన్జీఓ అసోసియేషన్ కార్యదర్శిగా ఉన్నాడు. మొన్నటివరకు ఎటువంటి పదవీలేని ఇత నికి సంయుక్త కార్యదర్శి పదవిని కట్టబెట్టారు. దీంతో ఇతను కార్యాలయంలో ఏ పనిచేయకుండా నగరంలో షికార్లు చేస్తుంటాడు. ఇతను పనిచేయక పోవడం వలన ఇతర సిబ్బందిపై పనిభారం వేయాల్సి వస్తుంది. కార్యాలయ అధికారిణి, ఏఓ సైతం ఇతన్ని ప్రశ్నించేం దుకు భయపడుతుంది.

ఇది కేవలం ఉదాహరణ మాత్రమే. ఇందులో నేతలుగా ఉన్న వారందరి పరిస్థితి ఇలాగే ఉంటుంది. వివిధ శాఖల ఉద్యోగులు ఇళ్ల స్థలాల కేటాయింపు కోసం సొసైటీగా ఏర్పడ్డారు. ఇంటి స్థలం కోసం నగదు చెల్లించినా ప్లాటు కేటాయించకుండా నిర్ల క్ష్యంగా వ్యవహరిస్తున్నాడని గతంలో వైద్య, ఆరోగ్య శాఖకు చెందిన ఉద్యోగులు ఎన్జీఓ హోంలో నేతలతో వాదనకు దిగారు. సరైన సమాధానం చెప్పలేక దురు సుగా ప్రవర్తించారు. ఈ విషయంపై ఇప్పటికి తేల్చ లేక పోయారు. ఉద్యోగ సంఘాల పేరుతో నేతలను వెనకేసుకు రావడంపై జిల్లా ఉన్నతాధికారులు ఆలో చించాల్సిన అవసరం ఉంది.




✍ అల్లూరు రహీం

ఎన్నో తమిళ అనువాద సినిమాలు తెలుగులో హంగామాతో విడుదలై బకెట్ తన్నేసిన సంగతి ప్రేక్షకులకు విదితమే. విలక్షణ నటుడు విక్రమ్ నటించిన శివతాండవం కూడా అదే బాట నడిచింది. ఈ సినిమా తమిళంలో గతవారమే విడుదలయ్యింది. అక్కడ ఈ సినిమాకు మిశ్రమ స్పందన వచ్చినా తెలుగు ప్రేక్షకులను శివతాండవం ఆకట్టుకోలేదు. నత్తనడకన ఈ సినిమా నడవడంతోపాటు పాటలు సరిగ్గా లేవు. తెలుగులో విడుదల చేసే సమయంలో కుట్లూ, బ్యాండేజీలు వేసినా ఫలితమివ్వలేదు. శివతాండవం చిత్రానికి నెల్లూరీయుడు చిల్లర కళ్యాణ్ నిర్మాత. కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వపు బాధ్యతలు విజయ్ నిర్వర్తించాడు. హాలీవుడ్ సినిమా తరహాలో శివతాండవాన్ని తీయతలచి తీయలేక దర్శకుడు చతికిలబడిపోయాడు. 75శాతం సినిమా లండన్‌లో తీశారు. ఆ నడత బాగుంటే ప్రేక్షకులను ఆకట్టుకొంటుంది కాని లండన్‌ను చూసి బ్రహ్మాండమనలేరు కదా? ఈ చిత్రంలో అనుష్క, అమీజాక్సన్, లక్ష్మీరాయ్ హీరోయిన్లు. అనుష్క పాత్రను బాగా తీర్చిదిద్దినా, మిగతా ఇద్దరిని దర్శకుడు కథాపరంగా సరిగ్గా వాడలేకపోయాడు. సంగీత దర్శకుడు జి.వి.ప్రకాష్ కుమార్ ఒక్క పాటకు చక్కని సంగీతం అందించ లేకపోయాడు. ఈ చిత్రంలో గొప్పగా చెప్పుకోవాల్సింది కెమెరామెన్ నీరవ్‌షాను. ఆయన లండన్ అందాలతోపాటు చిత్రంలో ప్రతి ఫ్రేమ్‌ను బాగా తీశాడు. చాలా రోజుల తర్వాత మాటలు వ్రాసిన శ్రీరామకృష్ణ ఈ చిత్రంలో వ్రాసిన గొప్ప డైలాగ్ ప్రేమ వున్నంత వరకూ ఎవరూ అనాధ కాదు. ఈ చిత్రంలో మూడు పాత్రల్లో హీరో విక్రమ్ కనపడతాడు. ఆయన నటన వరకు వేలెత్తి చూపాల్సిన అవసరం లేదు. జగపతిబాబు ఈ చిత్రంలో విలన్‌గా నటించాడు. ఇక తెలుగులోనూ జగపతిబాబు ఇటువంటి పాత్రలను కొనసాగించవచ్చు. హీరో విక్రమ్, హీరోయిన్ అనుష్కలు పెళ్లి చేసుకొని ఢిల్లీలో కాపురం పెట్టినా ఇద్దరి మధ్య ప్రేమున్నా దగ్గర కానట్లు చూపడం కొత్తగా వున్నా ప్రేక్షకులకు ఈ తరహా విరహం నచ్చలేదు. సస్పెన్స్ కోసమంటూ చేసిన ఎడిటింగ్ చిత్రాన్ని గందర గోళం చేసిపారేసింది.

చిత్ర సమీక్ష

చిత్రకథలోనికి వెళ్తే విదేశీ ఇంటెలిజెన్స్ విభాగాన్ని పర్యవేక్షించే 'రా' విభాగంలో అత్యున్నత అధికారి శివకుమార్(విక్రమ్). ఈ విభాగంలోనే శరత్(జగపతి బాబు) పని చేస్తుంటాడు. వీరిద్దరూ మంచి స్నేహితులు కూడా. ఈ విభాగపు అధిపతి రవిచంద్ర (షాయాజీ షిండే). లండన్‌లో ఓ ఆపరేషన్‌ను విజయవంతంగా ముగించిన శివకుమార్‌ను కేంద్ర హోమ్ శాఖామంత్రి(కోట శ్రీనివాసరావు) అభినందిస్తాడు. ఈ వ్యవహారం ముగిసిన వెంటనే స్వగ్రామం వెళ్లిన శివకుమార్‌కు వాళ్ల అమ్మ(శరణ్య) మరోమాట కూడా చెప్పకుండా మీనాక్షి(అనుష్క)తో పెళ్లి జరిపిస్తుంది. మీనాక్షి ఢిల్లీలోని ఓ ఆస్పత్రిలో కంటి డాక్టర్. ఐ రీసెర్చ్ ఫౌండేషన్ పెట్టి దేశంలో అంధత్వం లేకుండా చేయాలన్నది ఆమె ఆశయం. శోభనం నాడు నువ్వు ఢిల్లీలో ఇన్‌స్పెక్టర్‌వా? అంటుంది మీనాక్షి. వివరాలు చెప్పక తల వూపేస్తాడు శివకుమార్. కాని మీనాక్షిలోని బహుముఖీయ ప్రజ్ఞకు ముగ్ధుడవుతాడు శివకుమార్. లండన్‌లోని ఎంఐ గూఢచారి సంస్థకు చెందిన స్టీఫెన్ మనదేశానికి చెందిన రహస్యాలను ఫోజర్ ద్వారా తమ దేశానికి పంపుతాడు. ఆ ఫోజర్‌ను స్వాధీనం చేసుకోను అర్జున్ రాథోడ్ పేరిట లండన్ వెళ్లే శివకుమార్‌కు ఇబ్బందులు చుట్టుముడతాయి. దీనికి కారణం సహ అధికారి శరత్ అని తెలుసుకొంటాడు. శరత్ మీనాక్షితో సహా లండన్ వచ్చి ఈ ఆపరేషన్ నుంచి శివకుమార్‌ను తప్పుకోమంటాడు. ఇక్కడి టవర్ బ్రిడ్జి దగ్గర జరిగే పేలుడులో మీనాక్షి చనిపోతుంది. శివకుమార్‌కు కళ్లు పోతాయి. ఆయన లండన్ మిత్రుడు థామస్ కూడా చనిపోతాడు. థామస్ భార్య(లక్ష్మీరాయ్) శివకుమార్‌ను రక్షిస్తుంది. తన భర్త మరణంతోపాటు శివకుమార్ జీవితాన్ని నాశనం చేసిన వారందరినీ శివతాండవమాడి మట్టి గరిపేలా చేయడంతో చిత్రం ముగుస్తుంది.

## పెద్ద కోరికలు లేవు



కథానాయిక ప్రాధాన్యమున్న పాత్రలే చెయ్యాలి. నటిగా మరెవ్వరికీ రానంత పేరు నాకు రావాలి లాంటి పెద్ద పెద్ద కోరిక లేవీ నాకు లేవు. నేను చేస్తున్న సినిమా విజయం సాధించాలి. నిర్మాత సంతోషంగా ఉండాలను కొంటానని చెబుతోంది తాప్సి. ఈ ముద్దుగుమ్మ దక్షిణాదిలో వరుస అవకాశాన్ని అందుకొంటోంది. ఇటీవలే 'డబుల్స్' అనే చిత్రంతో మళయాళంలోనూ నటించే అవకాశం చేజిక్కించుకొంది. గుండెల్లో గోదారి చిత్రం విడుదలకు సిద్ధమైంది. తెలుగులో షాడోలో గోపీచంద్, రామ్ చిత్రాల్లో నటిస్తోంది. తమిళంలోనూ పేరున్న కథానాయకులతో ఆడిపాడుతోంది. ఇన్నేసి అవకాశాలు అంది పుచ్చుకొంటున్నారు. ఏమిటి రహస్యమని అడిగితే... అవకాశాలు వస్తున్నాయంటే దాని వెనుక కష్ట పడడం తప్ప రహస్యం ఉండదని గ్రహించాలి. నా కెరీర్‌లో గొప్ప గొప్ప విజయాలు లేకపోవచ్చు. మంచి చిత్రాల్లో నటించాను. నాకు అప్పజెప్పిన పాత్రలకు న్యాయం చేశాను. అది చూసే దర్శకులు అవకాశమిస్తున్నారని సమాధానమిచ్చింది తాప్సి.

## ఐటెంపాటలు చేయను!



హీరోయిన్ శ్రుతిహసన్ ఇప్పుడు విజయానందంలో మునిగి తేలుతోంది. గబ్బర్‌సింగ్ ఇచ్చిన ఉత్సాహంతో హిందీలో నటిస్తోంది. ఈ మధ్యనే దక్షిణాదిన శ్రుతికి సంబంధించి వార్త ఒకటి ప్రచారంలోకి వచ్చింది. త్వరలో 'నాయక్' చిత్రంలో ఆమె ప్రత్యేక గీతంలో నర్తించ బోతోంది అని. ఈ వార్త ఆమెను చాలా ఇబ్బంది పెట్టింది. వెంటనే సోషల్ నెట్‌వర్క్ ట్విట్టర్‌ని ఆశ్రయించింది. నాయక్‌లో ఐటమ్‌పాటలు చేస్తున్న విషయం నిజం కాదు. తెలుగులో నేను ఒప్పుకొన్నది ఒక్క చిత్రమే. అది బలుపు సినిమా అని స్పష్టం చేసింది. ఇలాంటి వార్తలు ఎలా పుడతాయో అర్థం కావట్లేదు. ప్రస్తుతం తెలుగులో విజయం సాధించిన నువ్వొస్తానంటే నేనొద్దంటానా హిందీ రీమేక్‌లో నటిస్తూ బిజీగా ఉన్నా. ఇక ఐటమ్ పాటలు ఎక్కడ చేస్తానంటుంది.

## సదా వార్తల్లో సోనమ్



హీరో అనిల్‌కపూర్ కుమార్తె అనే గుర్తింపు తప్ప... నటిగా సోనమ్ కపూర్ పెద్ద పేరు తెచ్చుకోకపోయినా నిరంతరం వార్తల్లో మాత్రం ఉంటుంది. ఈ ముద్దుగుమ్మ నటించిన చిత్రాలు ఫర్వాలేదనిపించే స్థాయిలోనే ఉంటాయి. సోనమ్ నటన కూడా అదే స్థాయిలో ఉంటుంది. అయితే ఈ ముద్దుగుమ్మ మాత్రం బాలీవుడ్ యువతరానికి ఓ ఐకాన్‌గా నిలిచే ప్రయత్నం చేస్తోంది. ఫ్యాషన్ రంగం మొత్తం ఆమె వైపే దృష్టి పెడుతుంటుంది. ఎప్పటికప్పుడు కొత్త శైలి దుస్తులతో ఫ్యాషన్ పెరేడ్స్‌లో హల్‌చల్ చేస్తుంటుంది. పత్రికల కవర్ పేజీలపై సరికొత్తగా దర్శనమిస్తుంటుంది. నటిగా పెద్దగా పేరు తెచ్చుకోలేకపోయినా... అవకాశాలు మాత్రం చేతినిండా ఉంటాయి. అప్పుడప్పుడు ప్రేమ కబుర్లతోనూ వార్తల్లో నిలుస్తుంటుంది. హేట్ లవ్ స్టోరిస్ చిత్రం నుంచి దర్శకుడు పునీత్ మల్హోత్రాను సోనమ్ ప్రేమిస్తుందని ప్రచారం జరుగుతోంది.

## ఘాటైన ముద్దులివ్వలేదు!



ప్రీతిజింతా తెరపై కనిపించి చాలారోజులే అయ్యింది. ఐపీయల్ మ్యాచ్‌లు జరుగుతున్నప్పుడు అమ్మడు చేసే సందడి చూస్తూ అభిమానులు ఖుషీ అయిపోతుంటారు. ఈ ముద్దుగుమ్మ మళ్లీ వెండితెరపై మెరవబోతోంది. తానే నిర్మాతగా మారి 'ఇష్క్ ఇన్ పారిస్' అనే చిత్రాన్ని తీసింది. ఇందులో ప్రీతినే ప్రధాన పాత్రధారి. ఈ చిత్రంలో సల్మాన్‌ఖాన్ ఒక ప్రత్యేక గీతం చేశారు. ఈ పాటలో ముద్దు సన్నివేశాలు చాలా ఉన్నాయనే పుకార్లు బైటికొచ్చాయి. ఈ విషయం ప్రీతి ముందుంచితే.. ఈ చిత్రంలో రొమాన్స్ ఉంటుంది. ఐతే అది పెదవీ, పెదవీ కలిపేంత. అందరూ అనుకొంటున్నట్లుగా ఘాటైన సన్నివేశాలేమీ ఉండవని నవ్వుతూ చెప్పింది ప్రీతిజింతా.

## తెలుగు నేర్చుకొన్న దీక్షా!



వేదం, వాంటెడ్, మిరపకాయ్, నిప్పు, ఊకొడితే ఉలిక్కిపడతా, రెబల్ చిత్రాల్లో హీరోయిన్ దీక్షాసేథ్ తెలుగు బాగా మాట్లాడుతుంది. ఎలా నేర్చుకొన్నారంటే ఇలా మాట్లాడడానికి చాలా కష్టపడాల్సి వచ్చింది. కొత్తలో ఏమీ అర్థమయ్యేది కాదు. సెట్లో కూడా గందరగోళంగానే వుండేది. తెలుగు నేర్చుకోవాలనే పట్టుదల వచ్చేసింది. ప్రత్యేకంగా తెలుగు తరగతులకు వెళ్లాను. వారానికి ఆరు రోజులు ప్రతి సాయంత్రం రెండు గంటలు క్లాసులు ఉండేవి. మాస్టారు బాగా శిక్షణ ఇవ్వడంతో తెలుగు వచ్చేసింది. భాషపై పూర్తిపట్టు సాధించానని చెప్పను గానీ, అన్ని మాటలు అర్థమవుతున్నాయంది. త్వరలో సినిమాల్లో డబ్బింగ్ కూడా చెబుతానంటుంది.

# ట్రాఫిక్ సమస్యకు పరిష్కారమెట్లా?

## • అందరూ మారాలి

నగరంలో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచి పోతున్నాయి. గంటల తరబడి ట్రాఫిక్ జామ్ వలన వాహనాలపై వెళ్లే వాళ్లే కాదు నడిచిపోయే వాళ్లు కూడా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఎదురౌతున్నాయి. రోడ్డు దాటాలంటే పాదచారులు సర్కస్ ఫీట్లు చేయాల్సి వస్తోంది. దీనికంతటికీ కారణం అస్తవ్యస్తంగా ఉన్న ట్రాఫిక్. అయ్యప్పగుడి వద్ద నుంచి స్టోన్‌హౌస్‌పేట వరకు గల ప్రధాన రహదారితోపాటు, సందు గొందుల్లోనూ ఎక్కడచూసినా ట్రాఫిక్ ఇబ్బందులే. అడుగు అడుగడుగునా బారులు తీరుతున్న వాహనాలు, ముందుకు కదలని ట్రాఫిక్, అడ్డదిడ్డంగా నిలిపి ఉండే వాహనాల నడుమ పాదచారుల రాకపోకలతో చిందరవందర గందరగోళంగా మారింది. ఆటోల సమూహాలు రోడ్డునంతటినీ ఆక్రమిస్తుంటే తమకు ఎలాంటి ట్రాఫిక్ రూల్సు పట్టవట్టన్నట్లు సిటీ బస్సులు ఎక్కడపడితే అక్కడ నిలిపేస్తుంటే మధ్యలో రోడ్డుపై నిలిపిన వాహనాలు ఇలా ప్రతీది ట్రాఫిక్ నడతకు ఆటంకంగా మారుతుండడంతో ఎక్కడిక్కడ వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ స్తంభించి పోతోంది. పోలీస్ ఉన్నతాధికారులు ఎన్ని సంస్కరణలు చేపడుతున్నా ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తున్నా, ట్రాఫిక్ అడ్వయిజరీ సంఘాన్ని నియమించి పరిశీలన చేయించినా అవన్నీ బూడిదలో పోసిన పన్నీరుగా మారుతున్నాయి తప్ప నగర ట్రాఫిక్ గాడిలో పడడం లేదు. దీనికి కారణం వాహనాలు నడిపే వారి దగ్గర్నుంచి, ట్రాఫిక్ పోలీసులు, షాపుల యజమానులు, తోపుడు బండ్లపై వ్యాపారం నిర్వహించేవారు ఇలా అందరూ కారణమనే చెప్పాలి. ఎవరికి వారు తమకేమీ సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తుండడం, ఎవరూ బాధ్యతగా వ్యవహరించకపోవడంతో ట్రాఫిక్ చిక్కుముడి విడిపోవడం సంగతి అటుంచితే మరింతగా బిగుసుకపోతోంది. దీనికితోడు వాహనాలు నిలుపు చేసుకొనేందుకు మునిసిపల్ అధికారులు తగిన పార్కింగ్ స్థలాన్ని చూపక పోవడం ఈ సమస్యను మరింత జఠిలం చేస్తుంది. విజయవాడ, గుంటూరు తదితర నగరాల్లో చేపట్టిన విధంగా ఆటోలను నియంత్రించడంతోపాటు బస్సులకు ముక్కుతాడు వేయడం, ప్రజలు, పోలీస్, మునిసిపల్ అధికారులు కలసికట్టుగా ప్రయత్నిస్తే తప్ప నగర ట్రాఫిక్‌లో మార్పు రాదు.



నెల్లూరు రోడ్లపై ట్రాఫిక్ గందరగోళం.

# తహశీల్దార్లు చిత్తశుద్ధిగా పనిచేయాలి!

## సెట్‌కాన్ఫరెన్స్‌లో కలెక్టర్

రెవిన్యూపరంగా అర్హులైన లబ్దిదార్లకు పట్టాదారు పాసుపుస్తకాలు, టైటిల్ డీడ్ తదితరాలను మంజూరు చేసి పంపిణీ గావించడంలో తహశీల్దార్లు చిత్తశుద్ధిగా పనిచేయాలని కలెక్టర్ బి.శ్రీధర్‌రెడ్డి హితవు పలికారు. కలెక్టర్ తన ఛాంబర్ నుంచే రెవిన్యూ శాఖాపరంగా సిజెఎఫ్ఎస్, భూపంపిణీ, పట్టాదారు పాసుపుస్తకాలు, ఎఫ్‌బిఎస్, ఆపద్బంధు, దీపం, ఎస్‌జిఎస్‌వై, ఐఎస్ఎల్ తదితర కార్యక్రమాలపై నెట్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గ్రామాలవారీగా మంజూరు చేసిన సిజెఎఫ్ఎస్ భూములను లబ్దిదారులు వ్యవసాయయోగ్యంగా చేసుకుంటూ పంటలు పండించుకుంటున్న వాటిని గుర్తించి అటువంటి లబ్దిదారులకు పట్టాలు మంజూరు చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆకాంక్షించారు. సన్న చిన్నకారు రైతులకు రుణాలు మంజూరు చేయడంలో అవసరమయ్యే పట్టాదారు పాసుపుస్తకాలు, టైటిల్ డీడ్ తదితర రెవిన్యూ పత్రాలను అందించడంలో కొందరు రెవిన్యూ అధికారులు అలక్ష్యం ప్రదర్శిస్తున్నారని సుతిమెత్తగా చెప్పారు. దీపం కార్యక్రమం క్రింద నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయడంలో వెనుకబడడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో ఖాళీగా ఉన్న 143 అంగన్‌వాడీ కార్యకర్తలు, 93 మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు, 188 సహాయకుల పోస్టులను భర్తీ చేసేందుకు నిబంధనల మేరకు డిడిపిఓలను సమన్వయంతో అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెట్ కాన్ఫరెన్స్‌లో ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ బి.లక్ష్మీకాంతం, జడ్పీ సిఇఓ వీరభద్రయ్య, డిఆర్‌డిఏ పిడి వెంకట సుబ్బయ్య, డిఎస్‌డిఓ ఉమామహేశ్వర రావు, ఎస్సీ, బిసి కార్పొరేషన్ ఇడిలు సోమయ్య, కోటీశ్వరరావు, డ్వామా పిడి గౌతమి పాల్గొన్నారు.

# కులం, మతంకంటే మానవత్వం గొప్పది!

## నెల్లూరులో మంద కృష్ణమాదిగ

రాష్ట్రంలో మాదిగ రిజర్వేషన్ల సాధన కోసం గత 18 సంవత్సరాల నుంచి పోరాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మంద కృష్ణ కులాన్ని, మతాన్ని విడిచి పెడుతున్నట్లు తెలుస్తుంది. కులం కోసం ఇప్పటివరకు ఉద్యమాలు చేస్తూ వస్తున్న ఆయన ఇకనుంచి వృద్ధులు, వితంతువులు, వికలాంగుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తున్నట్లు ప్రకటించారు. ఈ నెల 7వ తేదీ నెల్లూరుకు వచ్చిన మంద కృష్ణ విలేకరుల సమావేశంలోనూ, నర్తకి సెంటర్‌లో నిర్వహించిన బహిరంగసభలోనూ మాట్లాడారు. కులం, మతం కంటే మానవత్వం చాలా గొప్పదని ఆయన చెప్పారు. రాష్ట్రంలో కోటి మందికిపైగా వృద్ధులు, వితంతువులు ఉన్నారని వారి సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీరి గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. వృద్ధులు, వితంతువులు, వికలాంగులను కేవలం ఓటు బ్యాంకుగా ఉపయోగించుకొంటున్న పాలకులను గ్రామాల్లో నిలదీయాలని ఆయన పిలుపు నిచ్చారు. యుద్ధభేరి పేరిట అన్ని జిల్లాలు, డివిజన్ కేంద్రాల్లో బహిరంగ సభలు నిర్వహించిన అనంతరం రాజధానిలో ఆందోళన చేపడతామని వివరించారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి నేతలు ఆవుల నాగేంద్ర, ఎమ్మార్పీఎస్ నేతలు జన్ని రమణయ్య, బద్దెపూడి గిరి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.




సభలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ.

# లబ్దిదారులకు నేరుగా రుణాలు!

రాజీవ్ యువశక్తి పథకం కింద ఎంపిక కాబడిన లబ్దిదారులకు ఇక నుంచి రాష్ట్ర కార్యాలయం నుంచి రుణాలు అందనున్నాయి. జిల్లాలకు నిధులు కేటాయించి నిరుద్యోగులకు వివిధ పథకాలు మంజూరు చేసి అమలు చేసేవారు. ఈ పథకం అమలుపై రెండు మూడు దఫాలు సమీక్ష జరిపిన ఆ శాఖ రాష్ట్రస్థాయి అధికారులు లోటుపాట్లను గుర్తించారు. జిల్లాకు విడుదల చేసిన నిధులు నిర్ణీత సమయం లోపల ఖర్చు చేయలేక పోతున్నారన్నది ప్రధాన కారణం. బ్యాంకు లింకేజీ ద్వారా మాత్రమే నిధులు ఖర్చు చేయాల్సి రావడంతో కొందరు బ్యాంకు అధికారులు రుణాలు అందించేందుకు తీవ్ర జాప్యం చేస్తున్న విషయం తెలిసిందే. బ్యాంకుల నుంచి పూర్తి సహకారం అందకపోవడంతో రాజీవ్ యువశక్తి అధికారులు కూడా ఏమీ చేయలేక పోతున్నారు. జిల్లా నుంచి లబ్దిదారులు దరఖాస్తు చేసుకుని, బ్యాంకు మంజూరు లేఖ జత చేసి హైదరాబాద్‌కు పంపాల్సి ఉంటుంది. దీంతో రాష్ట్రస్థాయి అధికారులు దరఖాస్తులను పరిశీలించి లబ్దిదారుడి బ్యాంకు ఖాతాకు నిధులు జమ చేస్తారు. ఈ కొత్త విధానాన్ని ఈ నెల నుంచి అమలు చేయాలని అధికారులు నిర్ణయించారు. జిల్లా రాజీవ్ యువశక్తి విడుదల చేసే నిధులు వివిధ కార్యక్రమాలకు వినియోగించే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు.

## రాజీవ్ యువశక్తి పథకంలో మార్పు

# ఆరవ విడత భూ పంపిణీ!

## నవంబర్ 1వతేదీ ముహూర్తం

గత సంవత్సరం నుంచి జిల్లా ప్రజలను ఊరిస్తూ వస్తున్న 6వ విడత భూ పంపిణీ కార్యక్రమాన్ని నవంబర్ 1న అమలు చేయాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది. ఇటీవల రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి రఘువీరారెడ్డి జిల్లా కలెక్టర్, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి భూ పంపిణీకి సంబంధించి చర్చించారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా నెల్లూరు జిల్లాలో గుర్తించిన ప్రభుత్వ భూములను అర్హులైన వారికి పంపిణీ చేయాలని ఆదేశించారు. దీంతో రెవిన్యూ యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. జిల్లాలోని 46 మండలాల్లో ఇప్పటివరకు ఎన్నివేల ఎకరాలు సేకరించారు? ఎంతమంది లబ్దిదారులను గుర్తించారు? అన్న సమాచారాన్ని సేకరించే పనిలో పడ్డారు. 6వ విడత భూ పంపిణీలో ఎస్సీ, ఎస్టీ, బిసిలతోపాటు వికలాంగులకు కూడా ప్రాధాన్యతనివ్వాలని గత నెలలో వికలాంగులు కలెక్టర్‌ను ముట్టడించిన సంగతి తెలిసిందే. ఎంత సేపటికీ కలెక్టర్‌ను కదలనివ్వకపోవడంతో వికలాంగుల డిమాండ్‌ను అంగీకరించక తప్పలేదు. నవంబర్ 1న పంపిణీలో వీరిని కూడా లబ్దిదారులుగా గుర్తించాల్సి ఉంటుంది. కొన్ని మండల తహశీల్దార్లు ఆయా మండలాల్లో ప్రభుత్వ భూములు లేవని కలెక్టర్‌కు నివేదించగా, కలెక్టరేట్ రికార్డుల్లో మాత్రం ప్రభుత్వ భూములున్నట్లు అధికారులు గుర్తించడం జరిగింది. తహశీల్దార్లు, కలక్టరేట్ ఉద్యోగులు చెప్పేదానికి పొంతన కుదరక పోవడంతో కలెక్టర్ ఆగ్రహించారు. సమగ్ర నివేదిక అందించాలని ఆదేశించారు.



నెల్లూరు పొగతోటలోని ప్రభవ నేతృత్వంలో నడిచే తొలిబడిలో గాంధీ జయంతిని పురస్కరించుకొని చేనేత వస్త్రాలు ధరించి జాతిపితను అర్చిస్తున్న చిన్నారులు.

## జీవితమంతా జైలేనా?

16వ పేజీ కొరవ

సుప్రీంకోర్టు బెయిల్ నిరాకరించిన ప్రక్కరోజు నుంచి అటు సిబిఐ, ఇటు ఈడి విభాగాలు ఇంత కాలం నిలిపి వుంచిన విచారణను వేగవంతం చేశాయి. కలకత్తా కంపెనీల ద్వారా స్వదేశంలో, మారిషస్ కంపెనీల ద్వారా విదేశాలలో జరిపిన నగదు లావాదేవీలకు సంబంధించి వారు ఖచ్చిత మైన సమాచారం సేకరించారని వినికిడి. అది మనీ ల్యాండరింగ్ చట్టం క్రిందకు వస్తుంది. మార్చి నెలలోపల సుప్రీంకోర్టు ఆదేశం ప్రకారం సిబిఐ దాఖలు చేయబోయే చివరి ఛార్జిషీట్‌లో ఈ చట్టం క్రింద నేరం ఆపాదించే అవకాశం వుంది. మనీ ల్యాండరింగ్ చట్టం చాలా కఠినమైనది. దాని క్రింద నేరం ఆపాదిస్తే, ఛార్జిషీట్ దాఖలు తర్వాత కూడా ఏ కోర్టూ బెయిల్ ఇవ్వదు. మధు కొడా సంఘటన అందుకొక ఉదాహరణ. న్యాయస్థానాలలో కేసు పరిష్కారమయ్యే వరకు జైలులోనే వుండవలసిన పరిస్థితి ఏర్పడుతుందని జగన్ అనుయాయులు భయపడుతున్నారు. దాని అర్థం ఎన్నికల నాటికి కూడా జగన్ జైలు నుంచి బయటకు వచ్చే అవ కాశం దొరకకపోవచ్చు. అంతకాలం నాయకత్వం లేకుండా పార్టీని నడపడం అంత సులభమైన విష యం కాదు.

ఆ ప్రమాదాన్ని పసిగట్టడం వల్లనే, పార్టీని బలోపేతం చేయడానికి, కార్యకర్తలలో ఏర్పడిన నిరాశా నిస్పృహలను పారద్రోలడానికి విజయమ్మ ద్వారా పాదయాత్ర లేదా బస్సు యాత్ర జరిపించా లనే ఆలోచన. అయితే రాష్ట్రం మొత్తం నెలల పర్యంతం పర్యటన జరిపే ఆరోగ్యం, ఓపిక విజ యమ్మలో సహజంగానే వుండవు. చెల్లెలు షర్మిళను ముందుపెట్టి యాత్ర చేస్తే ఎట్లా వుంటుందనే ప్రతిపాదన వచ్చింది. రేపు 18తేది నుంచే తల్లి కానీ, చెల్లి కానీ యాత్ర ప్రారంభించే అవకాశం వుంది.

సుప్రీంకోర్టు బెయిల్ నిరాకరించినా, నెలలు లేదా సంవత్సరాలు జైలులోనే గడపాల్సినంత ఆర్థిక నేరాలు చేశాడని నిర్ధారణ అయినా, జనంలో మాత్రం జగన్ మీద అభిమానం తరగడం లేదు. కాంగ్రెస్ వ్యతిరేకతను జగన్ ద్వారా తీర్చుకోవాలనే ధోరణి కొనసాగుతున్నది. ఈ జనాదరణను ఓట్ల రూపంలో మలచుకొనే బాధ్యత విజయమ్మ, షర్మిళల మీద పడుతున్నదిప్పుడు. వారికి సహజం గానే ప్రజలలో మంచి స్పందన రావడం ఖాయం.

## ప్రజల మీద అంత కక్షా?

మొదటి పేజీ కొరవ

లలో కరెంట్ అనేది ఒకటి వుంటుందన్న సంగతే మర్చిపోతున్నారు ప్రజలు. రోజుకు పదహారు గంట లకు పైగా విద్యుత్ కోత నడుస్తున్నది. వ్యవసాయా నికి నాలుగు గంటలు కూడా సరఫరా ఇవ్వడం లేదు. బావుల మీద, బోరు నీటి మీద ఆధారపడిన ప్రాంతాలలో పంటలు మలమల మాడిపోతున్నాయి.

రానున్న ఆరేడు మాసాలలో పరిస్థితి ఇంత కంటే దారుణంగా, దౌర్భాగ్యంగా వుండబోతున్నదని చెప్తున్నది ఎపి ట్రాన్స్‌కో. అంటే రాష్ట్రంలో అటు వ్యవసాయం, ఇటు పరిశ్రమలు కూడా చతికిలబడ పోతున్నాయన్న మాట. ఎందువల్ల ఈ దుస్థితి? మహా రాష్ట్రలో వానలు లేక, నాగార్జునసాగర్, శ్రీశైలం రిజర్వాయర్లు ఎండి పోవడమే ఇందుకు కారణమని ఒక కుంటిసాకు చెప్తున్నారు. మన రాష్ట్రంలో ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఎపిజెన్‌కో 8924 మెగావాట్ల కరెంట్ ఉత్పత్తి సామర్థ్యం కలిగి వుంది. అందులో థర్మల్ 5100, హైడెల్ 3800 మెగావాట్లు. ఇందులో నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులకు సంబంధించిన దాదాపు 2వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరగడం లేదు. ప్రైవేటు రంగంలోని కోన సీమ, ల్యాంకో, జివికె, జిఎంఆర్ వంటి ప్రాజెక్ట్‌లలో గ్యాస్ లేక విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయి వుంది. వ్యవసాయానికి కనీసం రెండు గంటలపాటు కరెంట్ ఇవ్వాలంటే 450 మెగావాట్లు అదనంగా కావాలని, అదే సమయంలో పరిశ్రమలకు కనీసం 50శాతం సరఫరా జరపాలంటే మరొక 1250 మెగా వాట్ల ఉత్పత్తి అవసరమని తేల్చి చెప్పింది ట్రాన్స్‌కో. అంటే దాదాపు 1700 మెగావాట్ల విద్యుత్ కొరత వుందన్న మాట. దీన్ని తీర్చడం కోసం యూనిట్ విద్యుత్‌ను 10 రూపాయల వరకు ధర చెల్లించి ఇతర ప్రాంతా లలో కొనుగోలు చేస్తున్నారు.

వానలు లేవు కాబట్టి రిజర్వాయర్లు నిండ లేదు. వాటిలో నీళ్లు లేవు కాబట్టి హైడెల్ విద్యుత్ పని చేయదు. గ్యాస్ లేదు కాబట్టి ప్రైవేటు విద్యుత్ ప్రాజెక్ట్‌లు మూతపడ్డాయి. ఇవన్నీ రాష్ట్ర ప్రభుత్వం చేతిలో లేని పరిణామాలు. ప్రభుత్వం అనుకొంటే వాన కురిపించలేదు, గ్యాస్‌ను వెలికి తీయలేదు. కానీ ప్రభుత్వానికి ముందు చూపు అనేది వుండి వుంటే, ఎపిజెన్‌కో సారధ్యంలో నిర్మాణంలో వున్న కృష్ణపట్నం విద్యుత్ కర్మాగారం నిర్మాణపు పనులు ఈ పాటికి పూర్తి చేసి వుండవచ్చు. లక్ష్యం ప్రకారం ఈ డిసెంబర్ నెలకు కృష్ణపట్నం నుంచి 1600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కావాలి. కానీ సరైన శ్రద్ధ లేకపోవడం వల్ల ఆ కర్మాగారం వచ్చే జూన్ లేదా జూలై నెలకు కానీ ఉత్పత్తి ప్రారంభించే సూచన కన్పించడం లేదు. రాయలసీమ, కాకతీయ విద్యుత్ ప్రాజెక్ట్‌ల విస్తరణ సైతం అట్లనే నత్తనడక నడుస్తున్నది. ఆ రెండింటిలో కలిపి 1200 మెగా వాట్ల ఉత్పత్తి జరగాలి. ప్రభుత్వానికి ఏ మాత్రం ముందు చూపు వున్నా, రాష్ట్రాన్ని క్రమ్ముకొని వస్తున్న విద్యుత్ కొరతను గుర్తించి, ఈ మూడు ప్రాజెక్ట్‌ల నిర్మాణాన్ని ముందుకు జరిపి వుంటే రాష్ట్రం ఇంతగా చీకట్లో మ్రగ్గ వలసిన దుర్గతి తప్పి వుండేది. ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలుకు చాలినన్ని నిధులు ఇచ్చినా ట్రాన్స్‌కో కొంతలో కొంత కోత తీవ్రత తగ్గించి వుండేది. కానీ లక్ష కోట్ల బడ్జెట్ అని గొప్పగా చెప్పుకోవడం తప్ప ప్రజల జీవితాలను ప్రభావితం చేసే కార్యక్రమాలకు పైసలు విదిలిం చడం లేదు ఆర్థికశాఖ. దానితో చాలినంత కొను గోలు జరగడం లేదు. ఎపిజెన్‌కో ఆధ్వర్యంలోని థర్మల్ ప్రాజెక్ట్‌లకు చాలినంత బొగ్గు సరఫరా కూడా జరిపించలేక పోతున్నది ప్రభుత్వం. కేంద్రం లోని అధికారులు, మంత్రులతో గట్టిగా మాట్లాడితే తీరే స్వల్ప సమస్య అది. కానీ ఎవరికీ పట్టడం లేదు.

గతంలో చాలాసార్లు మన రాష్ట్రంలో ఇటు వంటి పరిస్థితులు తలెత్తాయి. కానీ అప్పటి ముఖ్య మంత్రులు ప్రతి రోజూ విద్యుత్ పరిస్థితిని సమీ క్షించి, ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలుకు నిధులు సమీకరించి, తామే స్వంతంగా ఎన్టీపిసి వంటి సంస్థలతో చర్చలు జరిపి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూసేవారు. కానీ ఇప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డికి అటువంటి పనులేవీ పట్టవు. రోమ్ నగరం తగలబడుతుంటే ఫిడేల్ వాయించిన నీరో చక్రవర్తి తరహాలో రాష్ట్రం అంధకార బంధురం అవుతున్నా లెక్క చేయకుండా జిల్లాల పర్యటనలు పెట్టుకొని, పొదుపులక్ష్మి మహిళలను ఆకట్టుకొనే పనిలో రోజులు, వారాలు గడిపేస్తున్నాడాయన. ప్రజల సమస్యల పట్ల ఇంతటి నిర్లక్ష్యంతో ప్రవర్తించే ముఖ్యమంత్రిని గతంలో ఎప్పుడూ చూడలేదు.

కాంగ్రెస్ పార్టీకి లేదా ప్రభుత్వానికి ప్రజల మీద ఏదైనా కక్ష వుందా అన్న అనుమానం కలుగు తున్నది పరిస్థితి చూస్తుంటే. ఇప్పటికే కేంద్రంలోని కాంగ్రెస్ సర్కారు ప్రజల నెత్తిన బండరాళ్లు విసర డంలో రికార్డు సృష్టిస్తున్నది. ఆర్థిక సంస్కరణల పేరిట వంట గ్యాస్ ధరల పెంపకంతో వారాడుతున్న ఆటలు చూస్తుంటే ఇది ప్రజా ప్రభుత్వమా లేక ప్రజా పీడన ప్రభుత్వమా అన్న అనుమానం కల్గుతున్నది. డీజల్ ధరల పెంపకంతో అన్ని రకాల నిత్యావసర వస్తువుల ధరలూ చుక్కలంటుతున్నాయి. సగటు మనిషి బ్రతుకు భారంగా మారుతున్నది. 2జి స్కాంలు, బొగ్గు గనుల కుంభకోణాలలో లక్షల కోట్లు దోచుకొనిపోయే వారికి రక్షగా నిలిచి, బ్రతకలేని సామాన్యులను మాత్రం త్యాగాలు చేయాలని ఉద్బో ధిస్తున్నారు ఈ ప్రబుద్ధులు. మరొకప్రక్క రాష్ట్ర ప్రభు త్వం ఏ ప్రజా సమస్య మీద శ్రద్ధ చూపకుండా పాలనను గాలికి వదిలేసి వినోదం చూస్తున్నది. ఈ పాపిష్టి ప్రభుత్వాలు ఎంత త్వరగా మట్టి కలిసిపో తాయా అని ప్రజలు శాపనార్థాలు పెట్టుకొనే పరి స్థితి కల్పించుకొంటున్నారు కాంగ్రెస్ నేతలు.

## పార్టీకి మళ్లీ జీవం

మొదటి పేజీ కొరవ

పులిని చూసి నక్క వాత పెట్టుకొన్నట్లు, వైఎస్‌ను చూసి తాను నడక మొదలు పెట్టాడు చంద్రబాబు. కానీ యాత్ర చేసే నాటికి వైఎస్ వయస్సు చాలా తక్కువ. ఆనాడు ప్రభుత్వం మీద ప్రజలు తీవ్ర ఆగ్రహంతో వుండినారు. ఆ కోపం తీర్చుకోవడానికి కాంగ్రెస్ ఒక్కటే ప్రత్యామ్నాయం. అందువల్ల ప్రభుత్వ వ్యతిరేకతా పవనాలు వైఎస్‌కు మలయ మారుతం వలె పనికి వచ్చాయి. ఇప్పుడు కూడా ప్రభుత్వం మీద ప్రజలలో చెప్పలేనంత అక్కసు వుంది. కానీ దాన్ని తీర్చుకోవడానికి జగన్ పార్టీ అందుబాటులో వుంది. అందువల్లనే ఎంత ప్రయత్నం చేసినా తెలుగుదేశం పార్టీ పునరుజ్జీవన ప్రయత్నాలు ఫలించడం లేదు. చివరి అస్త్రంగా, తన వయస్సును, ఆరోగ్యాన్ని కూడా పక్కనపెట్టి ప్రజల వద్దకు కాలినడకన వెళ్లడానికి ఉద్యుక్తుడయ్యాడు చంద్రబాబు. ప్రజలకు దగ్గర కావడానికి ఎంతగానో ప్రయత్నిస్తున్నాడు. ఎవరు పిలిచినా పలుకుతున్నాడు. ఎవరు పలకరించినా మాట్లాడుతున్నాడు. కాలు నొప్పిని పంటి బిగువున భరిస్తూ, చిరునవ్వులు చింది స్తున్నాడు. అయితే తెలుగుదేశం పట్ల ఎంత అయి ష్టత వున్నా ప్రజలు చంద్రబాబును ఆదరంగానే స్వాగతిస్తున్నారు. తమ బాధలు చెప్పుకోవడానికి ప్రభుత్వం మీద తమకున్న కోపం వ్యక్తం చేయడా నికి వారు ఈ అవకాశాన్ని వాడుకొంటున్నారు.

అయితే ఈ యాత్ర వల్ల నిరాశా నిస్పృహ లతో నీరసపడి వున్న తెలుగుదేశం కార్యకర్తలు ఎంత వరకు ఉత్సాహం పుంజుకోగలరన్నది ప్రశ్న. ప్రజలలో చంద్రబాబు పట్ల విశ్వాసం లేదన్న ప్రచా రం నిజం కాదని ఈ యాత్ర రుజువు చేయగల్గితే, కార్యకర్తలకు ఊపు వస్తుంది. కర్నూలు, మహబూబ్ నగర్ జిల్లాలు అందుకొక పరీక్ష వలె పనికి వస్తాయి. అయితే ఆ జిల్లాలలో జనాదరణ లేదన్న ప్రచారం జరగకుండా ముందుగానే జాగ్రత్త పడు తున్నాడు చంద్రబాబు. కర్నూలుకు నందమూరి బాల కృష్ణను, మహబూబ్‌నగర్‌కు జూనియర్ ఎన్టీఆర్‌ను పిలిపించబోతున్నారు. వారిద్దరూ గ్లామర్ కల్గిన నటులు కాబట్టి, చంద్రబాబు కోసం కాకపోయినా, వారి కోసం జనం ఎగబడడం ఖాయం. ఆ జిల్లా లలో వున్న నాయకత్వ లోపానికి ఈ గ్లామర్ ముసుగు బాగానే పనికి రావచ్చు.

## నెల్లూరుముచ్చట్లు

3వ పేజీ కొరవ

### మాజీ కార్పొరేటర్ సంక్రాంతి కళ్యాణ్ అరెస్టు

మనీస్కీం కేసులో మాజీ కార్పొరేటర్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత సంక్రాంతి కళ్యాణ్‌ను సిఐడి పోలీసులు అరెస్ట్ చేశారు. 65లక్షలకు పైగా వసూలు చేశాడని ఫిర్యాదందడంతో గతంలో ఒకటి రెండు సార్లు పోలీసులు విచారించారు. అక్టోబర్ 10వ తేదీన ఈ కేసుపై సంక్రాంతి కళ్యాణ్‌ను అరెస్టుచేసి కోర్టు ముందు హాజరు పరచడంతో కోర్టు రిమాండ్ విధించింది. ఆయన మాత్రం ఇది రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి కక్ష సాధింపు చర్యలో భాగమని ఆరోపించారు.

### తవ్వా రంగయ్య హ్యాట్రిక్!

నెల్లూరు శ్రీ పాండురంగ అన్నదాన సమాజం అధ్యక్షుడిగా తవ్వా రంగయ్య వరుసగా మూడోసారి విజయం సాధించారు. 7వ తేది ప్రతిష్టాత్మకంగా జరి గిన ఈ ఎన్నికల్లో తవ్వా రంగయ్య తన ప్రత్యర్థి గాధంశెట్టి గోపాల్‌పై 64 ఓట్ల మెజార్టీతో గెలిచారు. గెలుపుకు గోపాల్ ఎన్ని అడ్డదారులు తొక్కినా ఆర్య వైశ్య సోదరులు మాత్రం రంగయ్యవైపే మక్కువ చూపడానికి ఆయన సమాజంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలే కారణమనక తప్పదు.

### రత్నం ఒలిపింయాడ్ విద్యార్థి ఘనత!

నెల్లూరు ఎసి సుబ్బారెడ్డి స్టేడియంలో జిల్లా పాఠశాలల క్రీడాసమాఖ్య ఆధ్వర్యంలో జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ ఎంపికలు జరిగాయి. ఈ ఎంపిక్లో సరస్వతినగర్ రత్నం ఒలింపియాడ్‌లో తొమ్మిదో తరగతి చదివే విద్యార్థి బి.సాయిప్రతాప్ క్రికెట్ అం డర్ 16వ రాష్ట్రస్థాయి జట్టుకు అర్హత సాధించాడు. ఈ విద్యార్థిని విద్యాసంస్థల డైరక్టర్లు డాక్టర్ కె.కృష్ణ కిషోర్, వాసంతి అభినందించారు.




74 సం॥ వయస్సులోనూ, యువకునిలా నిత్యం వందలాది నిరుపేదలకు లాభాపేక్షలేని వైద్యం అందిస్తూ... ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలచిన ఆదర్శమూర్తి, మా పెద్దాయన

**ఉత్తరక్రియలు**

శ్రీ కొర్రా వెంకటేశ్వర్లు గారు తేది 05-10-2012 శుక్రవారం నాడు స్వర్గస్తులైనారు. వారి ఆత్మకు శాంతిని కలుగచేయమని భగవంతుని ప్రార్థిస్తూ...

కీ॥శే॥ కొర్రా వెంకటేశ్వర్లు P.M.P
జబ్బగుంట, బోగోలు.
జననం: 03-06-1938 మరణం: 05-10-2012

ఉత్తరక్రియలు: తేది 17-10-2012
బుధవారం "పెద్దకర్మ" జబ్బగుంట బోగోలులోని మా స్వగృహము నందు జరుగును.
కావున బంధుమిత్రులకు తెలియచేయడమైనది.

కుటుంబ సభ్యులు

కె.బాల మురళికృష్ణ, డా॥కె.చంద్రశేఖర్, కె.ఉదయ్‌బాస్కర్
మెడికల్ ఆఫీసర్

## పదరంగం -37

నిర్వహణ : బాబాజీ

| | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | 3 | 4 | ■ | 5 | 6 | | | 7 |
| | ■ | 8 | | | 9 | ■ | | ■ | ■ | |
| 10 | 11 | ■ | | ■ | 12 | | | ■ | ■ | ■ |
| 13 | | ■ | 14 | | | ■ | 15 | 16 | ■ | 17 |
| ■ | 18 | | | ■ | ■ | 19 | ■ | 20 | 21 | |
| ■ | | ■ | ■ | 22 | 23 | | ■ | 24 | | |
| 25 | | | ■ | 26 | | ■ | 27 | | | |
| ■ | ■ | ■ | 28 | | | ■ | ■ | ■ | | ■ |
| 29 | 30 | | | ■ | 31 | | 32 | ■ | ■ | |
| ■ | | ■ | | ■ | 33 | | ■ | 34 | | |
| ■ | | ■ | | ■ | 35 | | | | ■ | ■ |

**అడ్డం**

1. అభివృద్ధి చెందడం (5)
5. రాబోయే తరాలు (5)
8. అగౌరవం (4)
10. ప్రజలు (2)
12. తపస్సు చేసినవాడు (3)
13. శివుని వాహనం (2)
14. కాకి (3)
15. సత్యం (2)
18. పెండ్లి కుమారుడు (3)
20. నువ్వులు (3)
22. కంచి అమ్మవారు (3)
24. ఎలుక నివాసం (3)
25. తడబడిన పవిత్రం (3)
26. 'సర్'ని మేము ఇలా పిలుస్తాం (3)
27. చాలమందే, తడబడ్డారు (4)
28. అటు నుంచి, మూడు రంగుల జెండా (3)
29. తడబడిన మాయగాడు (4)
31. పవిత్రం (3)
33. పండుకాక ముందు ఇలాగే పిలుస్తాం (2)
34. అటునుంచి మోసం తడబడింది (3)
35. సాయంత్రం సమయం చివర్లో తడబడింది (4)

**నిలువు**

1. ఉపయోగం (4)
2. క్రింద నుంచి సగం (2)
3. ఏనుగును నడిపేవాడు (5)
4. క్రింద నుంచి గౌరవం, అభిమానం (2)
6. విలాసాలు కలిగిన యువతి (4)
7. క్రింద నుంచి చర్మం (2)
9. క్రింద నుంచి పిల్లలు (3)
11. శివుని వాహనం ముందుగా గల పువ్వు (5)
16. కరకరలాడే మురుగులు (4)
17. ముగ్గురు కాదు, ఐదుగురు కాదు (4)
19. కన్ను (2)
21. క్రింద నుంచి లోపల కాదు తడబడింది (4)
22. చెరువు (3)
23. వాయుపుత్రుడు (3)
28. పాటలు పాడే వ్యక్తి (4)
30. పాటలు పాడే స్త్రీ (3)
31. క్షీరాన్నము (3)
32. క్రింద నుంచి అడవి (3)
33. సమయం (2)

**సమాధానాలు**

## పదరంగం -36

| | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1అ | 2సి | ధా | 3రా | వ్ర | 4తం | ■ | 5సా | 6దృ | శ్య | 7ము |
| 8మ్మ | రి | ■ | ఘ | ■ | 9తి | 10ప | ■ | ష్టి | ■ | దు |
| ■ | 11సం | 12జీ | వ | 13కం | ■ | 14ల | 15గ్నం | ■ | 16ప | స |
| 17ద | ప | వి | ■ | 18చు | 19ల | క | న | ■ | 20చ | లి |
| ■ | ద | ■ | ■ | 21కం | త | ■ | ■ | 22ఆ | న | ■ |
| ■ | ■ | 23ల | క | ■ | ■ | 24శృం | ఖ | ల | ము | ■ |
| ■ | 25వ | ల | ■ | 26గ | 27ను | గా | ■ | మం | ■ | 28ణి |
| 29శ | కు | న | ము | ■ | 30పే | ట | ■ | 31ద | 32శ | రా |
| 33క | ళ | ■ | ■ | 34వు | ■ | 35కం | 36ది | ■ | ఠ | ■ |
| 37ల | మా | ■ | 38వు | ను | త | ■ | 39గం | గి | గో | వు |
| 40ము | త | క | ■ | మ | ■ | ■ | తం | ■ | పం | ■ |

# సంక్షిప్త సింహపురి

## వాత్సల్యకు విరాళం



చెన్నైలో నివాసం ఉంటున్న నెల్లూరు వాసి బండి శశిధర్‌రెడ్డి వారి తాత బండి రామచంద్రా రెడ్డి సంస్మరణార్థం 75వేల రూపాయల విరాళాన్ని జన హిత వాత్సల్యసంస్థ గౌర వాధ్యక్షుడు సామంతు గోపాలరెడ్డికి అందించారు. ఈ సందర్భంగా శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ నిరా ధార బాలబాలికలను ఆదుకోవడం అదృష్టమని, వాత్సల్య జనహిత చాలా చక్కగా నిర్వహించబడుచున్నదని తెలిసి ఈ మొత్తాన్ని ఇవ్వడం జరుగుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో వాత్సల్య జనహిత సంఘటనా కార్యదర్శి జి.వి. సాంబశివరావు, కార్యవర్గ సభ్యులు ఎ.జయప్రకాష్, నెల్లూరు గోపాలరెడ్డి పాల్గొన్నారు.

## సందాని బాషా ద్వితీయ వర్ధంతి!



మునిసిపల్ మాజీ వైస్ ఛైర్మన్ సయ్యద్ సం దాని బాషా ద్వితీయ వర్ధం తిని 3వతేది జెండావీధిలో ఘనంగా చేశారు. ఈ సం దర్భంగా రెండు వేలమం దికి అన్నదానం చేశారు. సందాని బాష కుమారుడు బిలాల్ మాట్లాడుతూ తన తండ్రి బతికి ఉన్నంత కాలం పేద ప్రజలకు అం డగా నిలిచాడని, మైనార్టీల సమస్యల పరిష్కారానికి కృషి చేశాడని చెప్పాడు. తాము కూడా అదే మార్గంలో నడుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ ఇలియాజ్, సయ్యద్ నిజాముద్దీన్, ఖలీద్, మీరా, సయ్యద్ ఉస్మాన్, అబూ బకర్, సిద్దిఖ్, జాఫర్, బాబ్‌జాన్, మున్వర్, రెహ్మాన్, అబూబకర్ పాల్గొన్నారు.

## గాంధీ జయంతి!

జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని నెల్లూరు జిల్లా అర్బన్ ఆర్య వైశ్య సంఘం ఘనంగా నిర్వహించింది. సంఘం అధ్యక్షుడు కోట గురు బ్రహ్మం నేతృత్వంలో ట్రంకురోడ్డులోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గురుబ్రహ్మం మాట్లాడుతూ గాం ధీజీ వంటి అహింసామూర్తి ప్రపంచంలో మరొకరు జన్మించే అవకాశమే లేదన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి తులసి చంద్ర శేఖర్, కోశాధికారి జొన్నలగడ్డ మోహన్‌రావు, నీలిశెట్టి వెంకటేశ్వర ప్రసాద్, ఎమ్పీ ఆంజనేయులు, కెవి చలమయ్య, గాధంశెట్టి గోపాల్, మెంటా బ్రహ్మంగుప్త, తిరివీధి ప్రకాశం పలువురు ఆర్యవైశ్య వాణిజ్య సంఘాల ప్రతి నిధులు పాల్గొన్నారు.

## సేవా దృక్పథం అవసరం!



వ్యక్తులు, సంస్థలు అధికారులు, ప్రజాప్రతి నిధులు తమవంతు సేవా దృక్పథంతో పనిచేస్తే దేశం ప్రగతిబాటన నడుస్తుందని ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ బి.లక్ష్మీకాంతం చెప్పారు. సింహపురి వెల్ఫేర్ ఆర్గనైజే షన్ ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఎసి సుబ్బారెడ్డి స్టేడియంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విశిష్ట సత్కారాలు పొందిన అధికారు లను లక్ష్మీకాంతం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మాగాంధీ, లాల్ బహుదూర్‌శాస్త్రి, సర్దార్‌వల్లభాయ్ పటేల్ వంటి నాయకుల అవసరం నేడు ఎంతో ఉందన్నారు. సేవా దృక్పథంతో కార్య క్రమాలు చేపడుతున్న వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు నిర్మల నరసింహారెడ్డిని అభినందించారు. రూరల్ డిఎస్పీ బాల వెంకటేశ్వరరావు, మునిసిపల్ కమి షనర్ టిఎస్ఆర్ ఆంజనేయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పొదుపు సంఘాలకు 54లక్షల రూపాయలు, అర్బన్ సెల్ఫ్ హెల్ప్ ఎంప్లాయిమెంట్ ప్రోగ్రామ్ క్రింద ముగ్గురికి 50లక్షల రూపాయలను ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ నెల్లూరు రీజినల్ మేనేజర్ జి.మస్తానయ్య అందించారు.

## సేవా కార్యక్రమాల్లో లయన్స్‌క్లబ్!



లయన్స్‌క్లబ్ ఆఫ్ నెల్లూరు ప్రపంచ శాంతి దినోత్సవాన్ని పురస్కరించు కొని మద్రాస్ బస్టాండ్ వద్ద గల పొణకా కనకమ్మ మెమోరియల్ పాఠశాల విద్యార్థినీ విద్యార్థులతో కలసి ట్రంకురోడ్డులో ర్యాలీ నిర్వహించారు. అనంతరం నెహ్రూ బొమ్మ వద్ద విద్యార్థినీ విద్యార్థులతో శాంతి ప్రతిజ్ఞ చేయించారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని ట్రంకు రోడ్డులోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాలాజీనగర్‌లోని అంజన అంధ విద్యార్థుల హాస్టల్‌కు వెళ్లి విద్యార్థులకు పండ్లు, ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కె.లక్ష్మీనారాయణ, కార్యదర్శి శ్రీధర్‌రావు, కోశాధికారి మోహన్ రాజ్, పి.ఆంజనేయులు, జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



## రైతు లోకం

# చీనీ, నిమ్మలలో వేరుకుళ్లు తెగులు - నివారణ!

జిల్లాలోని చీనీ, నిమ్మ తోటల్లో ప్రధా నంగా కనిపించే సమస్య వేరుకుళ్లు తెగులు. దీనివల్ల వేర్లు కుళ్లి, పోషక పదార్థాలు , నీరు చెట్టుకు అందకుండా చెట్లు ఎండిపోతాయి. వేర్లు పరీక్షిస్తే కుళ్లిన వాసన వస్తాయి. తెగులు సోకిన చెట్లు విపరీతంగా పూతపట్టి, కాయలు ముదిరేలోగా చెట్లు వాడి ఎండిపోతాయి. దీని నివారణకు రంగపూర్ నిమ్మ మీద అంటుకట్టిన మొక్కలను నాటడం శ్రేయస్కరం. వ్యాధి సోకిన తొలిదశలోనే గమనించి చెట్టుకు నీరు కట్టి మరుసటిరోజు కార్బండజిమ్ 2 గ్రాములు లేదా మాంకోజెబ్ 2.5గ్రా లీటరు నీటికి చొప్పున కలిపి లేదా 1 శాతం బోర్డో మిశ్రమంను చెట్ల పాదుల్లో నేల తడిచేటట్లు పోయాలి. సేంద్రీయ ఎరువులు, పచ్చిరొట్ట ఎక్కువగా వాడాలి. 1 కిలో ట్రైకోడెర్మావిరిడే" కల్చరును 90 కిలోల పశువుల ఎరువు 10 కిలోల వేప పిండితో కలిపి 15 రోజులు మాగబెట్టి, చెట్టుకు 10 కిలోల చొప్పున పాదిలో వేసి కలియబెట్టాలి. ఒక కిలో యూరియా 100 లీటర్ల నీటితో కలిపి పిచికారీ చేయాలి.

### చీని, నిమ్మలలో నల్లదోమ - నివారణ!

నల్లరంగులో వున్న పిల్ల పురుగులు ఆకుల నుండి రసాన్ని పీల్చడం వల్ల ముడుచుకు పోతాయి. నల్లదోమ విసర్జన నుండి వెలువడే తేనెలాంటి పదార్థం ఆకులపైన పడి శిలీం ద్రాలు పెరగడం వల్ల నల్లటి బూజు ఏర్పడి కిరణ జన్య సంయోగక్రియ జరగక చెట్లు క్షీణిస్తాయి. ఆకులు ముదరకముందే రాలిపోతాయి. నల్ల దోమ ఆశించిన చెట్లలో పూత, కాయల పరి మాణం మరియు నాణ్యత తగ్గిపోయి కాయలకు మార్కెట్లో ధర వుండదు. ఈ నల్లదోమ మార్చి వరకు అనగా చిగురువచ్చే దశలో ఎక్కువగా ఆశించి నష్టాన్ని కలుగజేస్తుంది. దీని నివార ణకు, తొలకరి వానలు పడకముందే చెట్లలోని ఎండుకొమ్మలు, నీటి కొమ్మలను కత్తిరించి మొక్క లకు బాగా గాలి తగిలేటట్లు చేయాలి. ప్రొఫెనో ఫాస్ 2 మిల్లీలీటర్లు లేదా క్లోరిపైరిఫాస్ 2.5 మిల్లీలీటర్లు లేదా ఇమిడోక్లోప్రిడ్ 0.25మిల్లీ లీటర్లు లేదా ఎసిఫేట్ 1.0గ్రామ లీటరు నీటికి చొప్పున కలిపి ఆకుల అడుగుభాగం, పై భాగం బాగా తడిచేటట్లు చిగురు వచ్చు దశలో (అక్టో బరు, డిసెంబరు) పిచికారి చేయాలి.

డాక్టర్ కె.పుల్లంరాజు
కోఆర్డినేటర్,
ఏరువాక (డాట్ సెంటర్), నెల్లూరు.

Regn.No. : RN 1156 / 57 J/Nellore/008/12-14



# జీవితమంతా జైలేనా?

బెయిల్ కోసం చాలా ఆరాటమే కాదు, ఆశ కూడా పడ్డాడు జగన్. ఆయన ఆశకు ఆధారం ఏమిటో మనకు తెలియదు. కానీ అక్టోబర్ 5తేదితో తనకు చెర విముక్తి కల్గుతుందని మాత్రం గట్టిగా నమ్మాడు. తన కుటుంబ సభ్యులు, పార్టీ నేతలలో అదే విశ్వాసం కల్గించాడు. తాను జైలు గేటు దాటి బయట అడుగు పెట్టే సందర్భం రాష్ట్రంలో ఒక పండుగ వలె జరగాలని కోరుకొన్నాడు. అందుకు అన్ని జిల్లాలలో పార్టీ కార్యకర్తలను సమాయత్తం చేశారు. ప్రార్థనలు, పాదయాత్రలు ఒక ప్రక్క ఉత్సవాలు, ఊరేగింపులు మరొక ప్రక్క జరపమని ఆదేశించాడు. కానీ సుప్రీం కోర్టు ఆ ఆశలన్నీ అడియాశలు చేసింది. బెయిల్ ఇవ్వకపోవడమే కాదు, మార్చి నెలాఖరు వరకు జైలులోనే వుండాలని ఆదేశించింది. దిమ్మతిరిగే తీర్పు ఇది. అటు జగన్‌కు, ఇటు ఆయన పార్టీ ముఖ్యులకు కూడా దిమ్మతిరిగేట్లు చేసింది ఈ ఉత్తర్వు. హతాశులను చేసింది.

బెయిల్ మీద జగన్ అంత నమ్మకం పెట్టుకోవడానికి రెండు కారణాలున్నాయి. మొదటిది – ఢిల్లీ స్థాయిలో కాంగ్రెస్ పెద్దలతో జరిగిన రాజీ ఒప్పందం. రాష్ట్రపతి ఎన్నికలలో సోనియాగాంధీ అభీష్టం మేరకు ప్రణబ్ ముఖర్జీకి ఓటు వేయడం ద్వారా తాను రాజీకి సుముఖమన్న సంకేతం పంపించాడు జగన్. ఆ వెంటనే సిబిఐ దర్యాప్తులో చాలా మార్పులు వచ్చాయి. జాయింట్ డైరెక్టర్ లక్ష్మీ నారాయణ పేరు వూరు విన్పడకుండా మాయమై పోయాడు. ఆరు రోజులు జగన్‌ను ప్రశ్నించడానికి హైకోర్టు నుంచి అనుమతి తెచ్చుకొన్న ఈడి అధికారులు రెండవ రోజే ఢిల్లీ విమానమెక్కేశారు. సుప్రీం కోర్టులో జగన్ బెయిల్ కేసు వాయిదా ముందురోజు సిబిఐ న్యాయవాదిని మార్పించారు. ఆరోజుకారోజు అంత సంక్లిష్టమైన కేసును ఎంత కొమ్ములు తిరిగిన న్యాయనిపుణుడు కూడా అర్థం చేసుకొని, వాదన విన్పించలేడు. ఇక్కడ వరకు పథకం బాగానే పారింది. కానీ సుప్రీంకోర్టు న్యాయవాది మార్పును గమనించి, ఆ మాట చెప్పకుండా, సూరీడు వాంగ్మూలం తామే చదివిన తర్వాత కేసు సంగతి చూస్తామని చెప్పి వాయిదా వేయడంతో పథకం బెడిసి కొట్టింది. దానితో కొత్త న్యాయవాదికి కూడా తగిన సమయం దొరికింది. పైనుంచి ఎటువంటి ఆదేశాలు వచ్చినా సిబిఐ అధికారులు మాత్రం కోర్టులో తమ వాదనను బలంగా విన్పించగలిగారు. జగన్ అక్రమ ఆర్జన నిజమే అన్న అభిప్రాయాన్ని ప్రాథమిక సాక్ష్యాధారాలతో న్యాయమూర్తులకు కల్గించగలిగారు.

నిజానికి జగన్ న్యాయవాదుల అభిప్రాయం వేరుగా వుండింది. ఆయన్ను అరెస్టు చేయడం అక్రమమని, సిబిఐ దర్యాప్తుకు అన్ని విధాలా సహకరించినా, ఎప్పుడు పిలిస్తే అప్పుడు వెళ్లినా, ఒక్క సాక్షిని కూడా ప్రలోభ పెట్టినట్లు ఆధారాలు లేకపోయినా, రాజకీయ ప్రమేయంతో సిబిఐ తమను హింసిస్తున్నదని గట్టిగా వాదిస్తే సుప్రీంకోర్టు మానవ హక్కుల కోణంలో జగన్‌కు బెయిల్ ఇస్తుందని న్యాయనిపుణులు భావించారు. కానీ సుప్రీంకోర్టు మాత్రం అరెస్టు సక్రమమా, అక్రమమా అన్న కోణం నుంచి కాక, ఆర్థిక నేరం జరిగిందా లేదా అనే కోణంలో కేసును చూడడంతో న్యాయవాదుల వాదనలు వీగిపోయాయి.

ఈ వార్త విని తట్టుకోలేకపోయాడు జగన్. కళ్లు చెమ్మగిల్లాయట. బెయిల్ వస్తుందన్న ప్రగాఢ నమ్మకం ఒమ్ము కావడం ఆయన్ను కలత పరిచింది. జైలులో ఆయనకు చాలా సుఖాలే అందుబాటులో వున్నాయి. స్వంతంగా ఒక గది. అందులో ఫ్యాన్, టీవీ, దిన పత్రికలు, కోరిన పుస్తకాలు, సేవ చేయడానికి సాధారణ ఖైదీలు, కుటుంబ సభ్యులతో మాట్లాడుకోవడానికి జైలరు గదిలో ఏర్పాట్లు, కోరిన భోజనం వండి, వడ్డించేందుకు వంట మనిషి వంటివన్నీ వున్నాయి. ఈ ఖాళీ సమయాన్ని ఆయన ఇంతకాలం బాగానే సద్వినియోగం చేసుకొన్నాడు. మొత్తం 294 స్థానాలలో తన పార్టీ తరపున నిల బెట్టవలసిన అభ్యర్థుల జాబితా తయారు చేసుకొన్నాడు. ఎన్నికల ప్రణాళిక రచించుకొన్నాడు. అందుకు అవసరమైన సమాచారం పార్టీ ముఖ్యుల ద్వారా ఎప్పటికప్పుడు అందుతూనే వుంది. మరొక ప్రక్క బైబిల్ పఠనం, ప్రార్థన నిర్విఘ్నంగా నడిచాయి. అయితే ఎన్ని వున్నా స్వేచ్ఛతో సమానం కాదు కదా?

ఇప్పుడు పరిస్థితి ఏమిటి? తన జైలు జీవితం మార్చి నెలాఖరు వరకు పరిమితమౌతుందా అంత కంటే ముందుకు వెళ్తుందా అన్నది పెద్ద ఆదుర్దా.

కొరవ 14వ పేజీలో







Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore. E-mail : jaminryot@yahoo.com